57368
57369

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

రథా నిలయం

డిసెంబర్ 20, 2009



భూమికి హాని

హ్యాపీ బర్త్‌డే

(2009 డిసెంబర్ 20 నుంచి
2009 డిసెంబర్ 26 వరకు)

వై.పుష్కక్(పండు)
1సం॥,డిసెంబర్-20
రమణమ్మ-అప్పలనాయుడు
విశాఖపట్నం

జి. జశ్వంత్ రాల్ఫ్
7సం॥,డిసెంబర్-24
బ్యాలా-శ్యాంబాబు
మార్కాపురం-ప్రకాశం

ఆర్.భానుశ్రీ
1సం॥,డిసెంబర్-20
పారిజాత-యాదగిరి
బాలానగర్-హైదరాబాద్

చరణ్‌తేజ
1సం॥,డిసెంబర్-2008
శ్రీకాంత్-లావణ్య
నిజామాబాద్

తేజస్
డిసెంబర్-25
ఎ.సదాలక్ష్మి-మధురాం
అంబర్‌పేట్-హైదరాబాద్

స్టీవెన్‌సన్
5సం॥,డిసెంబర్-2004
మేరి-ప్రేమ్‌కుమార్
సింగారము-మ॥నగర్

ఎం. రిత్విక్
4సం॥,డిసెంబర్-26
పావని-సాయిప్రసాద్
పాల్వంచ-ఖమ్మం

అక్షర సహస్ర
1సం॥,డిసెంబర్-2008
చందన-ఆర్.కె.నాయుడు
విశాఖపట్నం

ఆర్. శీతా
1సం॥,డిసెంబర్-2008
ఎన్.మాధవి-రాజు
గాంధారి-నిజమాబాద్

జీవర్ధన్‌రెడ్డి-శ్రీయారెడ్డి
డిసెంబర్
గీతారెడ్డి-రాజారెడ్డి
విశాఖపట్నం

ఎస్. ఇర్ఫాన్ అలి
డిసెంబర్
షహీన్-జహంగీర్
మౌలాలి-హైదరాబాద్

కె. మణిదీప్
డిసెంబర్-21
సువర్ణ-రామాంజనేయులు
తిరునాంపల్లి-కర్నూలు

ఎన్. మౌనిక
4సం॥,డిసెంబర్-22
భారతి-విజయ
పిరిడి-విజయనగరం

నాగ అక్షయ్
3సం॥,డిసెంబర్-22
పల్లవి-నాగరాజు
గుంతకల్లు-అనంతపురం

మనలో మాట

ఆట విడుపు

అటు కోపెన్‌హాగెన్‌లో వాతావరణ సెగలు. ఇటు రాష్ట్రంలో ప్రాంతీయ సెగలు. వీటి మధ్య ప్రజలకు ఆటవిడుపు రాజ్‌కోట్ వన్డే మ్యాచ్. మంగళవారం జరిగిన ఈ మొదటి అంతర్జాతీయ వన్డేలో రికార్డుల వర్షం కురిసింది. పరుగుల వరద పారింది. ఒక్క రోజులోనే వంద ఓవర్లలో 825 పరుగులు చేయడం ప్రపంచ క్రికెట్ చరిత్రలో రెండవసారి. భారత్, శ్రీలంక ఇరు జట్లూ ఒకరిపై ఒకరు అత్యధిక స్కోర్లు నమోదు చేసుకున్నదీ ఇక్కడే. మొత్తం మీద అటు ఆటగాళ్లను ఇటు క్రికెట్ అభిమానులను ఎంతగానో అలరించిన ఈ మ్యాచ్ గురించి కొన్ని ముచ్చట్లు.

వీరూ వీర విహారంతో వన్డేల్లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు (414/7) రికార్డును భారత్ మెరుగుపరచుకుంది. సెహ్వాగ్ 102 బంతుల్లో 17 ఫోర్లు, అరడజను సిక్సర్ల సాయంతో 146 పరుగులు చేసి తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్ల క్రితం పోర్టుఆఫ్ స్పెయిన్‌లో క్రికెట్ పసికూన బెర్ముడాపై 413 పరుగులతో నెలకొల్పిన రికార్డును రాజ్‌కోట్ మ్యాచ్ చెరిపేసింది. సెహ్వాగ్ పిచ్‌పై వున్నంత సేపు ప్రత్యర్థి జట్టుకు చెమటలు పట్టించాడు. మొదటి ఆరు ఓవర్లలో సంగక్కర తన ఫీల్డర్లను అటు ఇటు తరుముతుండడం ఇందుకొక చక్కని తార్కాణం.

ఓవర్ల వారీగా విశ్లేషించినప్పుడు తప్పక ప్రస్తావించవలసిన వాటిలో శ్రీలంక ఇన్నింగ్స్ 36వ ఓవర్ ఒకటి. జహీర్ ఖాన్ వేసిన ఈ ఓవర్‌లో సంగక్కర మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో మొత్తం 21 పరుగులు రాబట్టాడు. తద్వారా రన్‌రేట్‌ను ఉరకలెత్తించాడు. ఈ ఓవర్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న జహీర్ ఖాన్ 49వ ఓవర్‌లో కేవలం నాలుగు పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీసుకుని మ్యాచ్‌ను కీలకమైన మలుపుతిప్పాడు. 49వ ఓవర్‌లో జట్టు స్కోరు 401వద్ద వుండగా తిలినా కందంబి రనౌట్, చివరి ఓవర్‌లో మరో 11 పరుగులు చేస్తే విజయం సాధిస్తుందనుకున్న తరుణంలో మాథ్యూ అవుట్ కావడం శ్రీలంక కొంప ముంచాయి. సెహ్వాగ్‌కు తామేమీ తీసిపోమని సంగక్కర, దిల్షన్ నిరూపించారు.

భారత్ ఇన్నింగ్స్‌లో ఒక ఓవర్‌లో గరిష్ఠంగా సాధించింది 18 పరుగులే. అవి కూడా సెహ్వాగ్ సాధించినవే.

ప్రపంచంలో వన్డేల్లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు సాధించిన ఘనత ఇప్పటికీ శ్రీలంకదే. 2006లో క్రికెట్‌లో ఓనమాలు దిద్దుతున్న నెదర్లాండ్స్‌పై 9వికెట్ల నష్టానికి 443 పరుగులతో నెలకొల్పిన రికార్డును ఇప్పటివరకు ఎవరూ అధిగమించలేదు. ఆ తరువాత స్థానంలో సౌతాఫ్రికా (ఆస్ట్రేలియాపై 438), ఆస్ట్రేలియా (సౌతాఫ్రికాపై 434), భారత్ (శ్రీలంకపై 414), న్యూజిలాండ్ (ఐర్లాండ్‌పై 402) నిలిచాయి.

క్రికెట్ రానురాను బ్యాట్స్‌మెన్ గేమ్‌గా మారిపోతుందనేందుకు ఈ మ్యాచేకాదు ఇటీవల జరిగిన అనేక మ్యాచ్‌లు దృష్టాంతంగా నిలుస్తున్నాయి. అంతా బానే వుందికానీ మన జట్టు ఫీల్డింగేంటి ఇంత చెత్తగా వుందని అభిమానులు గుండెలు బాదుకుంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ మొత్తం మూడు క్యాచ్‌లు మిస్ చేసింది. ఇటీవల వరుసగా క్యాచ్‌లు డ్రాప్ చేస్తూనే వున్నారు. ట్వంటీ ట్వంటీ మ్యాచ్‌ల్లోనైతే ఐదేసి క్యాచ్‌లు జారవిడిచారు.

ఈ మ్యాచ్ చూశాక టెస్టుల్లో భారత విజయవిలాసం వన్డేల్లోనూ కొనసాగుతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఆశలను ధోనీ సేన నిలబెడుతుందని ఆశిద్దాం. ★

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	3
కవిత్వమ్	...	6
విజ్ఞాన వీచిక	...	7
కథ	...	8
రుచి	...	10
క్రైమ్ కథ	...	12
తాజా అద్భుతాలు	...	13
కొత్త పుస్తకాలు	...	17
అట్టమీది కథ	...	18
బాలనేస్తాలు	...	22
ఎవడిగోల వాడిది	...	24
చూద్దామా	...	26

ఇంకా...

స్ఫూర్తి ... 4

చైతన్య దీప్తులు

సినిమా కబుర్లు... 11

దీపికా పదుకొనె

వికాసం ... 28

ఏం చదువులో... ఏంటో...



నాటి విలన్లను గుర్తు చేశారు

డిసెంబర్ 6వ తేదీ ఆదివారం స్నేహ సంచికలో వచ్చిన కవర్‌స్టోరీ 'తెలుగు విలనీ తెర మరుగేనా?' చాలా బాగుంది. ఆ రోజుల్లో వేమూరి గగ్గయ్య విలన్‌గా ఒక ఊపు ఊపాడు. యమునిగా ఎందరినో భయపెట్టాడు. క్రమంగా ఎస్.వి.ఆర్, నాగభూషణం, సి.యస్.ఆర్, రావుగోపాలరావు, రాజనాల వంటి వారు విలన్లుగా రాణించారు. ఎన్‌టిఆర్, మోహన్‌బాబు డైలాగులతోనే విలనీని ప్రదర్శించారు. నాటి సినిమాల్లో నారాయణరావు నటన అమోఘం. 'పల్నాటి యుద్ధం' చిత్రంలో కన్నాంబ, మరొక సినిమాలో భానుమతి ప్రతినాయక పాత్రల్లో ఆకట్టుకున్నారు. నాటి మేటి విలన్ల - విలనీల గురించి గుర్తుచేశారు. ధన్యవాదాలు.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డి అన్నారం, హైదరాబాద్.

విలువైన 'స్ఫూర్తి'

స్నేహలో స్ఫూర్తి శీర్షిక ఎంతో విలువైనదిగా భావిస్తున్నాను. రెండు నెలల నుండి ప్రతి వారం ఈ శీర్షికను జాగ్రత్తగా దాచుకుంటున్నాను. కొన్ని పుస్తకాలు చదివి విపరీతమైన మానసిక సంతృప్తి పొందాను. ఈమధ్య చదివిన 'రక్తాశ్రువులు' అనే పుస్తకం గొప్ప అనుభూతిని మిగిల్చింది. ఒకవేళ ఇది చదవకుండా వుండివుంటే అనే ఆలోచన కూడా వస్తుంది. డాక్టర్ బెతూన్, డాక్టర్ కోట్నిస్‌గార్లు చైనా విముక్తి యుద్ధంలో సైనికులకు గొప్ప సేవ చేశారని మాత్రం తెలుసు. ఈ పుస్తకం చదివిన తర్వాత డాక్టర్ ఒక నాయకుడు, శాస్త్రవేత్త, పరిశోధకుడు, ఒక నిజాయితీగల కమ్యూనిస్టు చేయగలిగిన దానికంటే ఎన్నోరెట్లు సేవచేసి 49 సంవత్సరాలకే చనిపోయాడు. చనిపోతానని తనకు తెలిసి చివరిరోజు కూడా చేతి తొడుగులు లేకుండా శస్త్రచికిత్స చేసిన సర్జన్ కనిపిస్తాడు. కమ్యూనిస్టు కాబట్టే అలాంటి సాహసం, శ్రమ, పరిశోధన చేయగలిగాడు. ఒక మనిషి ఇన్ని పనులు చేయగలిగాడంటే నమ్మలేం. ఇది ఒక కల్పిత నవల అనుకుంటాం. కానీ నిజ జీవితంలో అనేక గొప్ప పనులు చేయగలిగాడు. ఆదర్శ వైద్యశాలను సైన్యం పాడు చేస్తుంది. అప్పుడు కొండలలో గుహలను ఏర్పాటుచేసి సేవ చేస్తాడు. ఇలాంటి అద్భుతాలు లెక్కకు చెప్పలేం. చివరిగా నేను అనుకున్నదేమిటంటే ఈ పుస్తకానికి వేరే పేరు పెడితే బాగుంటుందేమో!

మురళీధర్, విజయవాడ.

ఆకట్టుకున్న అట్టమీది కథ

ఈ సంవత్సరపు చివరి నెల మొదటి ఆదివారం సంచిక స్నేహలో తెలకపల్లి రవి అందించిన తెలుగు విలన్ల గురించిన అట్టమీది కథ ఆసక్తికరంగా వుంది. ప్రతినాయకుడు లేకపోతే ఎంత హీరో అయినా జీరో అవక తప్పదు. బొమ్మల మాంత్రికుడైన వెంకన్న జీవితంలో ఇంకా ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం. 'అదిరెనులే' చిత్రావళి సైతం నిజంగా అదిరాయి. వికాసం ద్వారా సంధ్యగారి 'గెలుపు - ఓటమి' స్కెచ్ బావుంది. కుసుమకుమారిగారి 'మల్లమ్మత్త కథ' హృద్యంగా వుంది. పానుగంటి చంద్రయ్యగారు చూద్దామా ద్వారా మాకందించిన 'బెలుం గుహలు' అద్భుతంగా వున్నాయి. బాలనేస్తాలులో క్రిస్టమస్ చెట్టు, సంతకం వంటివి మమ్మల్ని ఆకట్టుకున్నాయి. నవ్వుల్ పువ్వుల్‌లో 'నిద్రాభంగం, చెణుకు' తప్ప మిగతావన్నీ కొత్తగా వున్నాయి. రంగనాథ రామచంద్రరావుగారి మినీ కవితల్లో మానవత్వం, సామాజిక స్పృహ ప్రస్ఫుటించాయి. కల్తీమయ జగతిలో... కల్తీలేనివి మనలోమాట, కొబ్బరిబోండంలోని కొబ్బరినీళ్లేనేమో!?

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

బెలుం గుహలు చూడాలనుకున్నాం

డిసెంబర్ 6 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో చూద్దామా శీర్షికలో 'అబ్బురపరిచే బెలుం గుహలు' చదివాం. ప్రతిరోజూ 400 నుండి 500 మంది వరకు వీటిని చూడ్డానికి రావడం, ప్రజాశక్తి సిబ్బంది ఆ గుహలకు వెళ్లి అక్కడి విషయాలను తెలుపడం అభినందనీయం. ప్రపంచంలోనే నెంబర్2 గుహలుగా పేరు తెచ్చుకోవడం, క్రీస్తుపూర్వం 4500 నాటి మట్టి పాత్రలు ఇక్కడ దొరకడం, జైనులుండేవారని శంకరాచార్యులు చెప్పడం, 1884లో హె.బి. ఫూటె అనే ఆంగ్లేయుడు వీటి ఉనికిని చాటటం, 1988లో మన ప్రభుత్వ పురాతత్వ శాఖవారు రక్షిత స్థలంగా ప్రకటించి, కాపలాదారులను నియమించడం అభినందనీయమే. చారిత్రాత్మక బావి, చుట్టూ వున్న మెట్లు, 1946లో గ్రామ మునసబు బి. మల్లారెడ్డి బావి పటం గీయటం, వీటి వునికి, సందర్శన వేళలు, ఛార్జీలు, హరితవసతి, గృహ ఛార్జీలు వివరంగా తెలుసుకుని మా పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. రచయితకు ధన్యవాదాలు.

కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్.

స్నేహ భలేగుంది

డిసెంబర్ ఆదివారం స్నేహలో ప్రచురించిన అట్టమీదికథలో అలనాటి చిత్రాల్లో విలనీ గురించి చెప్పారు. అప్పట్లో పౌరాణిక పాత్రల ద్వారా చాలామంది సినీ రంగ ప్రవేశం చేసి అభిమానుల గుండెల్లో స్థిరపడ్డారు. అలాగే మంచి మంచి సినిమాల్లో కమెడియన్‌గానే కాకుండా మంచి ఆర్టిస్‌గా పేరుపొందిన నూటొక్కజిల్లాల అందగాడు (నూతన్ ప్రసాద్) చెప్పిన 'దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో వుంది' అనే డైలాగ్ ఇప్పటికీ ప్రేక్షకులకు ఊతపదంగా వుంది. అలాగే ఎం.ఎల్.ఏ ఏడుకొండలు ఎత్తిపోతల సంస్థ, ఇలాగే ఎందరో ఆర్టిస్టుల డైలాగులు ప్రేక్షకుల హృదయాల్లో స్థిరపడిపోయాయి. సినీ చరిత్రలో శోభన్‌బాబు 'దేవాలయం' సినిమా చాలా అద్భుతంగా తీశారు. రచయిత గొల్లపూడి మారుతీరావు తీసిన 'సంసారం ఒక చదరంగం' వంటి

కుటుంబ కథా చిత్రాలు ఎప్పటికీ మరువలేం. అప్పటి హీరోలు ఇప్పుడు రాజకీయ నాయకులైనారు. అలాగే హీరోయిన్లతో పోలిస్తే నటి శారద 'అమ్మ రాజీనామా' చిత్రంతో ఎందరికో కంట నీరు పెట్టించారు. ఈవారం సినీ తారల గురించి తెలియజేసిన తెలకపల్లి రవి గార్కి అభినందనలు. మనలోమాట 'అంతా కల్తీమయం' చాలా బాగుంది. ముందు ముందు రానున్న రోజుల్లో ఇంకా ఏమేం కల్తీ అవుతాయో చూడాలి. కవిత్వంలో రాజు పేరుతో కులాలను రెచ్చగొట్టడం, మతాల మంటలు రాజేయటం గురించి చక్కగా మధుగారు రాశారు. ఈ వారం 'మల్లమత్త కథ' చాలా బాగుంది. పెళ్లాల మాట వినే కొడుకులు జన్మనిచ్చిన తల్లిని పెరట్లో వుంచడం తప్పు. ఇలాంటి కొడుకులూ, కోడళ్లూ వుంటే మల్లమత్త లాంటి దేవుడమ్మలు వూరికోకరు వుంటారు. కానీ వారిని ఆదరించేవారు కూడా వుండాలిగా. ఈ కథ అందించిన కుసుమ కుమారిగారికి కృతజ్ఞతలు. బాల నేస్తాలు ద్వారా 'థాంక్యూ అమ్మా!' అంటూ ఉడుత తన బుల్లి ఉడుతను రక్షించడం బాగుంది. ఇంకా చేసేద్దాం కూడా నచ్చింది. పిల్లల చదువుల పట్ల గెలుపు, ఓటములను సంధ్యగారు వికాసంలో చక్కగా వివరించారు. ఈవారం జోక్స్ అన్నీ బాగున్నాయి. చివరి పేజీలో సముద్రంలో ప్రపంచాన్ని సృష్టించే ప్రకృతి, ఏరులు నదుల్లో కలిస్తే, ఆనదులు సముద్రాల్లో కలుస్తాయి. మామూలు మనిషికి సముద్రం ఓ ఆశ్చర్యం. పుచ్చకాయతో హంసరూపం చాలా బాగుంది. ఈవారం స్నేహ భలే అనిపించింది.

అనుపోజు సంతోషినాగరాజు, పూల్‌బాగ్‌కాలనీ, విజయనగరం.

★

నవ్వుల్ - పువ్వుల్

ముందు కదా!

టీచర్ : "ఎద్దు మరియు ఆవు పొలంలో మేస్తున్నది". రాజూ ఈ వాక్యాన్ని సరిచెయ్యి.
రాజు : ఆవు మరియు ఎద్దు పొలంలో మేస్తున్నది.
టీచర్ : అదెలా?
రాజు : మహిళలు ముందు కదా.

పోస్టు

మోహన్ : ఇప్పుడు నేను ఈ ఉత్తరాన్ని పోస్టు చేస్తే రెండు రోజుల్లో ఢిల్లీ చేరుతుందా?

పోస్ట్‌మాస్టర్ : తప్పకుండా చేరుతుంది.
మోహన్ : ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇది వెళ్లదు. కావాలంటే పందెం.
పోస్ట్‌మాస్టర్ : అదెలా! ఎందుకు వెళ్లదు?
మోహన్ : దీనిమీద ముంబయ్ చిరునామా వుంది కాబట్టి.

అమరప్రేమ

రఘు : నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?
రమ్య : అవును మైడియర్.
రఘు : నా కోసం చావటానికైనా సిద్ధమా?
రమ్య : లేదు. నాది అమరప్రేమ.

మానేశాను

మేధావి : పొగ తాగితే దగ్గు, క్షయ క్యాన్సరు ఇంకా ఇతర ప్రమాదకర వ్యాధులకు గురౌతారని అంతర్జాతీయంగా పెద్ద పెద్ద డాక్టర్లు గగ్గోలు పెడుతూ వ్యాసాలు రాస్తున్నారు. ఇవన్నీ చదివీ చదివీ ఇక లాభం లేదని, కొనడం మానేశానోయ్.

అనుచరుడు : ఏమిటి సిగరెట్లా?
మేధావి : కాదు. ఆ వ్యాసాలుండే పత్రికలు.

ఏదైతేనేం?

కస్టమర్ : వెయిటర్, ఇది నేట మాంసమా? పంది మాంసమా?
వెయిటర్ : మీరు రెంటికీ లేడా చెప్పగలరా?
కస్టమర్ : లేదు. నాకు తెలియదు.
వెయిటర్ : ఇక బాధేలేదు. ఏదైతేనేం తినండి.

ఎంతన్నారు?

(సభలో ఓ వ్యక్తి ఊకదంపుడు ఉపన్యాసం చేస్తున్నాడు)

వక్త : మరో 25 లక్షల సంవత్సరాలలో ఈ భూగోళం అంతరించిపోతుంది.

పెద్ద మనిషి : (ముందువరుసలో ఉండి కునికిపాట్లు పడుతున్నవాడల్లా కంగారుగా ఉలిక్కిపడి లేచి నిలబడి) ఎంతన్నారు?
వక్త : 25 లక్షల సంవత్సరాలు
పెద్ద మనిషి : హమ్మయ్య.... 2 లక్షలేమోనని భయపడ్డాను. (అంటూ ఆ పెద్దమనిషి మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు).

ఆయనకూ అంతే!

టీచర్ : మీ నాన్న వయసెంత?
చింటు : నాకెంతో ఆయనకూ అంతే.
టీచర్ : అదేంటి?
చింటు : నేను పుట్టినప్పుడే కదా ఆయన నాన్న అయింది.

ప్రేరణ

టీచర్ : ఏ పరిస్థితులు దొంగతనం చేయడానికి ప్రేరేపిస్తాయి?
1వ విద్యార్థి : ఆకలి
2వ విద్యార్థి : అసూయ
3వ విద్యార్థి : మితిమీరిన ఖర్చు
4వ విద్యార్థి : దొంగవస్తువులు కొనటం.

- లక్ష్మీనారాయణ

స్ఫూర్తి

> అరవై ఏళ్ల కిందట అంతంత మాత్రం చదువుతో నేను దానిలోని లోతైన విషయాలను, సైద్ధాంతికాంశాలను ఏ మేరకు గ్రహించగలిగానో చెప్పలేను. కాని కమ్యూనిస్టు సిద్ధాంతం గొప్పదనీ, నిర్మాణ సూత్రాలు చాలా విశిష్టమైనవనీ అర్థమైంది. అంతేగాక దానిపై నమ్మకం కూడా బలపడింది. పార్టీకి కట్టుబడి వుండటం, ఎప్పుడూ అది తీసుకునే నిర్ణయాలకు, నిర్మాణానికి లోబడి వుండటం జీవితంలో భాగమైపోయింది. అంతేగాకుండా ఆ పుస్తకంలోనే ఉద్యమ పెడధోరణుల గురించి, మితవాదుల (మెన్షివిక్కుల) లొంగుబాటు గురించి కూడా చాలా విషయాలున్నాయి. అవి కొంతవరకూ అర్థమైనందునే మేము ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు వచ్చినపుడు సిపిఎంతో నిలబడ్డాము. ఉగ్రవాద చీలిక కూడా మా జిల్లాలో చాలా తీవ్రంగా వచ్చింది. బోల్షివిక్ పార్టీ చరిత్రలో నరోద్నిక్కుల గురించి చాలా వివరంగా వుంటుంది. ప్రజలతో సంబంధాలు లేకుండా వ్యక్తిగత సాహసాల వల్ల సమాజం మారదని స్పష్టంగా చెబుతుంది. నాకు ఈ పుస్తకం ఇచ్చిన మండ్ల సుబ్బారెడ్డి కూడా ఆ రాజకీయాల వెంటవెళ్లిపోయాడు గాని మేము దాన్ని బలపర్చలేదు.

టి.సి.లక్ష్మమ్మ
ఐద్వా సీనియర్ నాయకులు.

చైతన్య దీప్తులు

నేను పెద్దగా చదువుకున్నదాన్ని కాదు. కాని వున్నంతలో చదివిన కొన్ని పుస్తకాలు నా జీవితాన్ని, కృషిని చాలా ఎక్కువగానే ప్రభావితం చేశాయి. అలాంటి వాటిలో ముందుగా చెప్పుకోదగింది "బోల్షివిక్ పార్టీ చరిత్ర". తర్వాత మాగ్జిం గోర్కి అమ్మ, ఆపైన తెలంగాణా సాయుధ పోరాటంపై వచ్చిన మహీధర రామమోహనరావు, గంగినేని వెంకటేశ్వరరావు రాసిన నవలలు, కావ్యాలు. ఒక విధంగా అవి నాకు అమితమైన ధైర్యాన్ని, రాజకీయ చైతన్యాన్ని కలిగించాయి.

సనాతన కుటుంబంలో అమ్మాయిలను చదివించడం బాగా తక్కువ. అయినా ఎలాగో ప్రాథమిక విద్య పూర్తి చేశాను. కర్నూలు జిల్లా వేంపెంట మా స్వగ్రామం. 1945 మేలో మా మేనత్త కొడుకైన నరసింహయ్య గారితో వివాహం జరిగింది. ఆ తర్వాత అత్తగారి వూరు గార్గేయపురం చేరాను. ఆయన అప్పటికే సామాజిక చైతన్యంతో కాంగ్రెస్‌లో పనిచేసేవారు. అయితే నేను పుట్టిన వూళ్లో కమ్యూనిస్టు వాతావరణం ఎక్కువగా వుండేది. ఆ విషయం నా భర్తకు చెప్పి తనను కూడా అటు వైపు మళ్లించేందుకు కృషి చేశాను. తర్వాత కాలంలో ఈ నాటి వరకూ ఇద్దరం కలిసే ఎర్రజండా నీడలో నడుస్తున్నాం. తర్వాత మా పిల్లలూ ఇతర కుటుంబ సభ్యులూ కూడా ఉద్యమంతోనే వున్నారు. దీనంతటికి అవసరమైన అవగాహననిచ్చి ప్రేరణగా నిల్చిన పుస్తకం 'బోల్షివిక్ పార్టీ చరిత్ర'.

మా వూరి దగ్గర్లోనే వెలుగోడు వుండేది. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకులలో ఒకరుగా వుండి, తర్వాత కాలంలో నక్సలైట్ నాయకుడుగా పేరొందిన చంద్రపుల్లారెడ్డి స్వగ్రామమది. అక్కడే మరో సీనియర్ నాయకుడు మండ్ల సుబ్బారెడ్డి. వీరందరూ మమ్ముల్ని ఎంతో అభిమానించేవారు. మండ్ల సుబ్బారెడ్డి నాకు 'బోల్షివిక్ పార్టీ చరిత్ర' ఇచ్చి చదవమని చెప్పాడు. అరవై ఏళ్ల కిందట అంతంత మాత్రం చదువుతో నేను దానిలోని లోతైన విషయాలను, సైద్ధాంతికాంశాలను ఏ మేరకు గ్రహించగలిగానో చెప్పలేను. కాని కమ్యూనిస్టు సిద్ధాంతం గొప్పదనీ, నిర్మాణ సూత్రాలు చాలా విశిష్టమైనవనీ అర్థమైంది. అంతేగాక దానిపై నమ్మకం కూడా బలపడింది. పార్టీకి కట్టుబడి వుండటం, ఎప్పుడూ అది తీసుకునే నిర్ణయాలకు, నిర్మాణానికి లోబడి వుండటం జీవితంలో భాగమైపోయింది. అంతేగాకుండా ఆ పుస్తకంలోనే ఉద్యమ పెడధోరణుల గురించి, మితవాదుల (మెన్షివిక్కుల) లొంగుబాటు గురించి కూడా చాలా విషయాలున్నాయి. అవి కొంతవరకూ అర్థమైనందునే మేము ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు వచ్చినపుడు సిపిఎంతో నిలబడ్డాము. ఉగ్రవాద చీలిక కూడా మా జిల్లాలో చాలా తీవ్రంగా వచ్చింది. బోల్షివిక్ పార్టీ చరిత్రలో నరోద్నిక్కుల గురించి చాలా వివరంగా వుంటుంది. ప్రజలతో సంబంధాలు లేకుండా వ్యక్తిగత సాహసాల వల్ల సమాజం మారదని స్పష్టంగా చెబుతుంది. నాకు ఈ పుస్తకం ఇచ్చిన మండ్ల సుబ్బారెడ్డి కూడా ఆ రాజకీయాల వెంటవెళ్లిపోయాడు గాని మేము దాన్ని బలపర్చలేదు. నరసింహయ్య గారు జిల్లా కార్యదర్శిగా వుండి పునర్నిర్మాణంలో కీలకపాత్ర వహించారు. అదే పుస్తకంలో ఇస్క్రా పత్రిక గురించి చాలా వుంటుంది. మేము గ్రామంలో పనిచేస్తున్నప్పుడు కూలివాడల్లోకి వెళ్లి పార్టీ పత్రికలు చదివి వినిపించేవాళ్లం. ప్రజాశక్తి, నవశక్తి, జనవాణి అలా ఆ సమయంలో ఏ పత్రిక వుంటే అది చదువుతూ వ్యవసాయ కార్మికులను చైతన్య పరిచేందుకు కృషి చేశాం. సనాతన కుటుంబం నుంచి వచ్చిన నా వంటి మహిళ ఆ పని చేస్తుంటే చాలా మందికి ఆశ్చర్యంగానే వుండేది. మా మామయ్య కూడా మొదట జీర్ణించుకోలేకపోయేవారు. అయితే ఆయన భూస్వామ్య పోకడలకు వ్యతిరేకి గనక మమ్ముల్ని మరీ తీవ్రంగా వ్యతిరేకించేవారు కాదు. సరే ఆ విధంగా పత్రిక చదివి వినిపించేప్పుడు కూడా నాకు బోల్షివిక్ పార్టీ చరిత్ర అనుభవాలు గుర్తుకు వచ్చేవి. తర్వాత కాలంలో మా అబ్బాయి రవిని పార్టీ పత్రికలో పనిచేసేందుకు పంపించడంలోనూ దాని ప్రభావం లేకపోలేదు.

'అమ్మ' పుస్తకం కూడా చాలా మందిలాగే

మమ్మల్ని బాగా ఉత్తేజ పర్చింది. అమ్మ మాకు ఆదర్శమూర్తి అయింది. మా అత్తగారు కూడా పార్టీ తరఫున ఎవరు వచ్చినా ఎంతో అభిమానంగా ఆదరించేది. అందరూ ఆమెను అమ్మలా చూస్తుండేవారు. అప్పుడు ఇప్పుడు కూడా నన్ను 'అమ్మ' అని కామ్రేడ్లు అంటుంటే 'అమ్మ' పుస్తకమే గుర్తుకొస్తుంది. నా భర్త ఉద్యమంలో పనిచేస్తున్నా నిరంతర అనారోగ్యం వెన్నాడేది. ఆయనకు చికిత్సకోసం ఎక్కడెక్కడో తిరిగాము. ఒకసారి రాయవేలూరులో చేర్పించాము. నాకు తమిళం తెలియదు గాని ఒకరోజు వెళ్తుంటే పెద్ద ప్రదర్శన పోతున్నది. ఎర్రజెండాలు చూసి వాళ్ల వెంట నడిచాను. రామమూర్తి మాట్లాడారు. తర్వాత ఆ కామ్రేడ్స్‌తో పరిచయం చేసుకున్నాను. వారు నా గురించి తెలుసుకోవడమే కాదు, మరుసటి రోజు స్థానిక ఎంఎల్ఏగా వున్న మన పార్టీ నాయకుడు వచ్చి పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి వెళ్లారు. ఇలాటి సందర్భాల్లో నాకు అమ్మ పుస్తకంలో చదివిన ఘట్టాలు గుర్తుకు వస్తుంటాయి. చెప్పాలంటే అవి చాలా చాలా వుంటాయి.

చదివిన మేరకు నాకు తప్పక గుర్తుండి పోయింది మహీధర రామమోహనరావు 'కత్తుల వంతెన'. తెలంగాణా పోరాట కాలానికి సంబంధించిన ఆ నవల కథ చెప్పలేను గాని ఒక వాక్యం మర్చిపోలేను. ఎంత వయసొచ్చిన ఆడవాళ్లయినా ఒంటరిగా పోరాదని, తమ కంటే బాగా చిన్నవాడైనా సరే ఒక అబ్బాయిని తోడు తీసుకెళ్లాలని చెప్పే పద్ధతిని దాంట్లో విమర్శించారు. నిజంగానే నాకూ అలా అనిపించేది. తోడు వున్నారా లేదా అని ఆలోచించకుండా ఒంటరిగా ధైర్యంగా ఎక్కడికైనా వెళ్లడం అలవాటు చేసుకున్నాను. మామూలుగానే నాకు చొరవ ఎక్కువగా వుండేది. ఉద్యమాలు, పోరాటాలలో గాని, ఆయన అనారోగ్యం వల్ల హైదరాబాదు తదితర చోట్లకు వెళ్లిన సందర్భంలో గాని ఒంటరిగా తిరగడానికి ఏ మాత్రం వెనకాడినట్టు నాకు జ్ఞాపకం లేదు. ఒకసారి విపరీతమైన వాన కురిసి నడుం వరకూ నీళ్ల పొంగుతున్న స్థితి. అలాగే వెళ్లాను. ఒకటికి రెండుసార్లు ఎవరైనా ఆకతాయిలు తారసపడినా యుక్తియుక్తంగానూ ధైర్యంగానూ ఎదుర్కోవడం తప్ప వెనకడుగు వేయలేదంటే ఇలాంటి ఉద్యమ సాహిత్యమే కారణం. మా వూళ్లో కూలీ రేట్ల కోసం సమ్మె జరిగినప్పుడు మహిళలను ప్రదర్శనగా తీసుకెళ్తుంటే పెదరెడ్ల ఏరియాలోకి వెళ్లేసరికి రాళ్లవాన కురవడం మొదలైంది. తర్వాత కాల్పులు కూడా. అయిదుగురు గాయపడ్డారు. ఈ ఘటనలన్నీ పుస్తకాల్లో ముందే చదివిన వాటిని గుర్తు చేస్తుండేవి గనక భయపడ్డం కంటే పోరాడాలన్న సాహసమే ఎక్కువగా వుండేది. ఒకసారి అప్పటి ప్రైవేటు బస్సులో ఒకే సీటు వున్నప్పుడు నాకిస్తానన్న డ్రైవర్ పెదరెడ్డిని కూచోబెట్టాడు. నేను నిరసన తెల్పితే ఆయన తప్పనిసరై దిగిపోయాడు. అది వూళ్లో పెద్ద సంచలనం కలిగించింది. కుట్రమిషన్ సెంటర్‌లోకి అధికారులతో పాటు పెత్తందార్లందరూ చొరబడితే పిల్లలు క్యారుమని ఏడవడం మొదలెట్టారు. నేను కోపగించుకోవడంతో మోతుబరులు కూడా కిమ్మనకుండా వెళ్లిపోయారు. చిన్నవైనా ఆ ఘటనలు చాలా సంచలనం కలిగించాయి. వీటికి అవసరమైన ధైర్యం చదివిన పుస్తకాల్లోంచి, పత్రికల్లోంచి వచ్చిందే. మునిసిపల్ కార్మికుల్లోనూ, బీడీ కార్మికుల్లోనూ పనిచేసినప్పుడు కూడా సాహిత్యంలో చదివిన పాఠాలు బాగా గుర్తుకు వచ్చేవి.

తెలంగాణా పోరాటానికి సంబంధించిన వాస్తవ గాథలను గంగినేని వెంకటేశ్వరరావు "ఎర్రజెండాలు, ఆదర్శ కుటుంబాల" పేర్లతో వివరంగా రాశారు. చిత్ర హింసలు పెడుతున్నా శత్రువుకు తలవంచని కమ్యూనిస్టు గెరిల్లా యోధుల గురించి అందులో చాలా కథలున్నాయి. వాటిని నిత్యం తల్చుకునేవాళ్లం. కొంత భిన్నమైన సందర్భాల్లో వాటిని ప్రస్తావించాల్సి వచ్చింది. మామూలుగానే పురుషులతో పోలిస్తే మహిళలు పనిచేయడంపై ఎన్నో ఆంక్షలు. పల్లెల్లో భర్తలు పెత్తందార్ల హంగుదార్లుగా వుండే కుటుంబాల మహిళలకు మరీ సమస్య. అలాంటి వారు కూడా చాటుగానైనా పార్టీకి సహాయం చేస్తుండేవారు. కనీసం సంఘీభావం తెలిపేవారు. ఒకసారి మా వూళ్లో సర్పంచి ఎన్నిక వచ్చింది. అప్పటికి చేతులెత్తే పద్ధతి. నాకు తెలిసిన ఒకావిడ భర్త భూస్వామి దగ్గర గుమస్తా. ఆమెను మాకు ఓటు వేయమని అడిగాను. భర్తకు తెలుస్తుందని ఆమె భయపడింది. "నీవు ఎన్నో సార్లు పుత్తిపుణ్యానికే దెబ్బలు తినివుంటావు కదా, ఈ ఒక్కసారి కూడా అంతే అనుకో" అని చెప్పాను. నేను చదివిన కథల్లో ఉదాహరణలు చెప్పాను. చివరకు ఆమె ధైర్యంగా భర్త ఎదురుగానే మన తరఫున చేయెత్తింది. మనం గెలవలేదు గాని ఆమెకు మాత్రం తన్నులు తప్పలేదు. పెద్దగా పాడలేకపోయినా చిన్నప్పటి నుంచి పాటలంటే చాలా ఇష్టం. కనక ఎక్కడెక్కడి పాటలు రాసుకుని పాడేందుకు ప్రయత్నిస్తుండేదాన్ని. వాటిలోని కొన్ని చరణాలు ఎప్పుడూ మరపురావు. మా వూళ్లో పార్టీ వ్యవస్థాపకుల్లో మరొక ప్రముఖుడు గుర్రం వెంకటరెడ్డి 'గర్భిణీ స్త్రీల కడుపుపై కట్టెలతోటి కొట్ట ఎముకలే రాని శిశువు ఎంత ఏడ్చె సిగ్గు ఎగ్గూ లేని నెహ్రూ రాజాజి పట్టాభిల పాలనలోన' అని పద్యం రాశాడు. పాలకుల దుర్మార్గాలను, పోలీసు దౌర్జన్యాలను చూసినప్పుడల్లా నాకు ఆ చరణాలు గుర్తుకువస్తుంటాయి. అమరజీవి డి.వి.సుబ్బారావు మరణించినపుడు సివి అనే కవి గేయంలో 'పుస్తెను సైతం ఎర్రజెండాకు అప్పగించిన భిక్షావతిని వదలి ఎలా వెళ్లిపోయావ'ని రాశారు. నాకు తరచూ గుర్తుకు వచ్చే వాక్యాలలో ఇదొకటి.

ఎనిమిది పదుల వయస్సులో అనేక విషయాలు మర్చిపోయినా ఇలాంటివి ఇంకా గుర్తున్నాయంటే కారణం ఆ రచనలు కలిగించిన ప్రేరణే. మా తర్వాతి తరంలో పైచదువులు చదివిన కార్యకర్తలు వచ్చి చురుగ్గా పనిచేయడం చూస్తుంటే చాలా సంతోషం కలుగుతుంటుంది. ఈ మధ్యన మా జిల్లాలో మహిళా సంఘం రాష్ట్ర మహాసభ జరిగినప్పుడు వారిని చూసి ఆనందించాను. వారికి కూడా ఇలాంటి సాహిత్యం ప్రేరణనిస్తుందని ఆశిస్తాను.

★

సనాతన కుటుంబంలో అమ్మాయిలను చదివించడం బాగా తక్కువ. అయినా ఎలాగో ప్రాథమిక విద్య పూర్తి చేశాను. కర్నూలు జిల్లా వేంపెంట మా స్వగ్రామం. 1945 మేలో మా మేనత్త కొడుకైన నరసింహయ్య గారితో వివాహం జరిగింది. తర్వాత ఆ అత్తగారి వూరైన గార్గేయపురం చేరాను. ఆయన అప్పటికే సామాజిక చైతన్యంతో కాంగ్రెస్‌లో పనిచేసేవారు. అయితే నేను పుట్టిన వూళ్లో కమ్యూనిస్టు వాతావరణం ఎక్కువగా వుండేది. ఆ విషయం నా భర్తకు చెప్పి తనను కూడా అటు వైపు మళ్లించేందుకు కృషి చేశాను. తర్వాత కాలంలో ఈ నాటి వరకూ ఇద్దరం కలిసే ఎర్రజెండా నీడలో నడుస్తున్నాం. తర్వాత మా పిల్లలూ ఇతర కుటుంబ సభ్యులూ కూడా ఉద్యమంతోనే వున్నారు. దీనంతటికి అవసరమైన అవగాహననిచ్చి ప్రేరణగా నిల్చిన పుస్తకం 'బోల్షివిక్ పార్టీ చరిత్ర'.



కవిత్వమ్

స్వప్నంలో చిరునవ్వు!

ఆర్.డి. మల్లేశ్వరరావు



చాలీ చాలని జీతం..
నిండీ నిండని ఉదరం..
కొండెక్కిన నిత్యావసరాల ఫలితం!
సన్న బియ్యం అందనంటూ..
గగన వీధిని 'పచారీ' చేస్తే..
దొడ్డు బియ్యం దొరకనంటూ
సామాన్యుని వెక్కిరిస్తోంది!
మోకాళ్లు ముడుచుకు పడుకునుంటే..
స్వప్నాల్లో..నిత్యావసరాల వెక్కిరింతలు! ఒళ్లు విరుపులు!! పళ్లబిగింపులు!!!
ఎక్కడో టీవీల్లో పెద్ద(ల) ప్రకటన.. చెవులు దిబ్బళ్లేసేలా!
'మేమున్నది నీకోసం..
మేమున్నది నీకోసం..' శ్రీశ్రీ కవిత్వంలా!
అర్థమయింది!?
గాంధీ వారసుల స్కందావారాలు...
ఖద్దరు నేతల కమ్మని మాటలు...
వింటున్నకొద్దీ.. కొద్దీ.. వెగటు పుట్టించే పదాల పద'నసలు'
ఇంతలోనే స్వప్నలోకంలో సామాన్యుని విహారం!
మిగిలిందిదేగా?!
ఆ పక్కన...
భీతావహ వస్త్రధారణతో బియ్యం భయపెడుతున్నాయ్..
నన్నేనా?.. అందర్నీను..!
నిప్పులకొలిమిని రాజేస్తూ పప్పులు తమ ఉనికిని కలవరపెడుతున్నాయ్...
నూనెలు సలసలమంటూ.. దగ్గరకొస్తే దహించేస్తామంటూ...
విచ్చుకత్తులు విప్పారుతున్నాయ్..
మాన్యుల అండ చూసుకుని సామాన్యునిపై ధరా ఘాతాలు సంధిస్తున్నాయ్!
ఈ దెబ్బకు జీవచ్ఛవాలై.. జిహ్వాచాపల్యాన్ని చంపుకుంటున్న జీవులెందరో..
నిత్యావసరాలు.. ఆత్మ..'హత్యావసరాల్ని' సృష్టిస్తున్నాయా?!
ఉలిక్కిపడ్డ మస్తిష్కంలో ఎన్నో ఆశలు...
ఊహాలోకం నుంచి నిజంలోకి.. ఒక అడుగు!
అదిగో.. అక్కడో మధ్యతరగతి మనిషి కేకలు...
ఎవరో అతడి పర్సుని ఖాళీ చేయించేస్తున్నారు బలవంతంగా!
బహుశ కూరగాయలు కాదుగదా?!
అవే!!!
క్రూరగాయాల్లేస్తూ... మనీ పర్సుని తస్కరించేస్తున్నాయ్
అతను నిలువెల్లా..వణికిపోతూ.. విలవిల్లాడుతూంటే.. అవి భలేగా నవ్వేస్తున్నాయ్!
ఈ లోపు మరో అడుగు.. మరో వైపు...
అక్కడ.. పెద్ద పెద్ద ప్రతిజ్ఞలు.. మైకు గొట్టాల్లోంచి..
తుపాకి తూటాల్లా.. వైమానిక శతఘ్నుల్లా!
'ముట్టడిస్తాం...
కట్టడి చేస్తాం...
మార్కెట్లనదుపు జేసేస్తాం...
నిత్యావసర ధరల జోరుకు కళ్లెం వేసేస్తాం...
సా...'మాన్యునికి' అండగా నిలిచేస్తాం...
పని పట్టేస్తాం...
దుమ్ము దులిపేస్తాం...
చీల్చి చెండాడేస్తాం...
సర్గాన్ని నేలకు దించేస్తాం...
............స్తాం..
............స్తాం..
............స్తాం!'
మళ్లీ వాళ్లే!
బహుశ వినడం మనకూ, చెప్పడం వారికీ అలవాటైపోయింది గదా..!?
స్వప్నంలో చిరునవ్వు
చిరునవ్వులోనే స్వప్నం!
ఏలికల మెలిక మాటల తెంపరి తనానికి!!
బహుశ ఆ మాటల బ్యాక్‌గ్రౌండ్...
'దళారులకు దారులు పరిచేస్తాం..
నిబంధనలకు నీళ్లొదిలేస్తాం..
నేలమీద నరకం చూపించేస్తాం..
మా మాటలు మేమే ఒగ్గేస్తాం...
గనుల్ని తొవ్వేస్తాం...
ధరల్ని పెంచేస్తాం..
డబ్బులు దాచేస్తాం..
మీ కష్టం దోచేస్తాం..
మీ నీళ్లు మీకే అమ్మేస్తాం...
ముక్కుపిండి మద్యాన్ని తాగించేస్తాం'
అనేగా...ని!
అక్కడో మూల సన్నగా...
ఏదో బక్క ప్రాణి.. బుడతడితో ఏవో చెబుతోంది..
'రాసులుగ బియ్యమూ కొలిచినారట ఇచట!
అంగళ్ల పప్పులూ అమ్మినారట ఇచట!!
నీళ్లను చితముగాను ఇచ్చినారట ఇచట!!!'
ఈ లోగా ఉలికిపాటు!
మరో నవ్వు.. బతుకు చిరు(చెర)నవ్వు!!

★

విజ్ఞాన వీచిక

జీవ బ్యాటరీ

ఎయిడ్స్, జలుబు, ఫ్లూ, అమ్మవారు వంటి వ్యాధుల మధ్య సారూప్యం ఏమిటో తెలుసా? వైరస్. ఇవన్నీ వైరస్ వల్ల కలుగుతాయి. అందువల్ల వైరస్ అనే సూక్ష్మాతి సూక్ష్మమైన వాటి నుండి అందరం దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాం. కానీ కొందరు కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు మాత్రం మరోలా ఆలోచిస్తున్నారు. వారు వైరస్‌లతో బ్యాటరీలు తయారు చేసే ప్రయత్నంలో వున్నారు. మరి ఆ వివరాలేంటో తెల్సుకుందామా!

- కాకర్లమూడి విజయ్

వైరస్‌లను జీవులలో చేర్చాలో, పదార్థాలలో చేర్చాలో ఇంకా తేలలేదు. కానీ ఈ సూక్ష్మమైనవి జన్యుపదార్థం కలిగి వుంటాయి. కాబట్టి జీవులే అనుకోవచ్చు. వైరస్ మామూలుగా వున్నప్పుడు ఏమీ చేయలేదు. కానీ అది మరో కణంలోకి వెళితే మాత్రం త్వరత్వరగా విజృంభిస్తుంది. అది మన కణంలోకి వెళ్లిందనుకుందాం. వెంటనే తన జన్యుపదార్థాన్ని కణంలోకి విడుదల చేస్తుంది. దాంతో కణంలో అసలు జన్యుపదార్థాన్ని పని చేయనివ్వకుండా చేస్తుంది. ఫలితంగా మన కణం వైరస్ ఆదేశాలకనుగుణంగా వైరస్ జన్యు కణాలను ప్రత్యుత్పత్తి చేయడం ప్రారంభిస్తుంది. అలా ఏర్పడ్డ కొత్త వైరస్‌లు కణాన్ని చీల్చి, కొత్త కణాలపై దాడి చేస్తాయి. అలా ఇన్‌ఫెక్షన్ ప్రారంభమౌతుంది.

వైరస్‌ల ఈ లక్షణాన్ని ఆధారం చేసుకుని బ్యాటరీలను తయారు చేయవచ్చన్నది శాస్త్రజ్ఞుల ఆలోచన. వైరస్‌లో కొన్ని జన్యుమార్పులు చేయడం ద్వారా లోహాన్ని ఆకర్షించుకునేలా చేశారు. అలా వైరస్ వెలుపల పూతలా చేరిన లోహం ఎలక్ట్రోడ్‌లా పనిచేస్తుంది. అలా పాజిటివ్, నెగెటివ్ ఎలక్ట్రోడ్‌లను వైరస్ సహాయంతో తయారు చేయవచ్చని నిరూపించారు.

ఇలాంటి సూక్ష్మబ్యాటరీలు తయారు చేయడానికి హానికరమైన రసాయనాలు గానీ, ఖరీదైన పరికరాలు గానీ అవసరం వుండదు. పైగా, ఈ వైరస్ బ్యాటరీలు రీచార్జ్ చేసుకునే వీలుగలవి కూడా. ఆ క్రమంలో వైరస్ బ్యాటరీలు సుమారు వందసార్లు చార్జ్ - రీచార్జ్‌లను తట్టుకోగవు. ఇన్ని సుగుణాలున్న ఈ సూక్ష్మబ్యాటరీలు రాబోయే రోజుల్లో నానోటెక్నాలజీ సంబంధిత పరికరాల్లో బాగా ఉపయోగపడవచ్చని ఆశిస్తున్నారు.

ఇదిలా వుంటే, కొన్ని నెలల క్రితం బ్యాటరీల రంగంలో మరో అద్భుతాన్ని సుసాధ్యం చేశారు విజ్ఞాన వేత్తలు.

సాధారణంగా బ్యాటరీలు రీచార్జ్ చేయాలంటే కొన్ని గంటలు పడుతుంది. ఈ మధ్యకాలంలో ప్రాచుర్యం పొందిన లిథియం బ్యాటరీలు ఎక్కువ శక్తిని నిక్షిప్తం చేసుకుంటాయి. కానీ రీచార్జ్ కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. అందుకు కారణం శక్తిని మోసే అయాన్లు నెమ్మదిగా కదలడమేనని తొలుత అనుకున్నారు. కానీ అయాన్లు కొన్ని చోట్ల ఆగిపోవడమే అందుకు కారణమని తేల్చారు. ఈ అవరోధాన్ని తొలగించడం కోసం పరిశోధకులు కొత్త ఉపరితలాన్ని రూపొందించారు. ఫలితంగా బ్యాటరీ కేవలం 20-30 సెకన్లలో- అవును సెకన్లే- పూర్తిగా రీచార్జ్ అయిపోతుంది. ఈ కొత్త బ్యాటరీలు మరో రెండేళ్లలో అందుబాటులోకి రావచ్చుని అంటున్నారు.

★

ముదురు

ఫర్వాలేదు! అందంగానే వున్నాను.
అందుకే రూపాయి కట్నం లేకుండా కట్టుకున్నాడు.

కథ

అలగా గుంపు

- మొలకలపల్లి కోటేశ్వరరావు

రామనరసయ్య కొడుకు పెళ్లి రాత్రి చాలా ఘనంగా జరిగింది.

ఊరంతా బంతి పెట్టారు.

ఆయన కొడుకు ఎంసిఎ చదివాడు. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మంచి ఉద్యోగం అని చెప్పి ఎక్కువ కట్నం తీసుకుని పెళ్లి చేసుకున్నాడు.

పొద్దున్నే ఎరుకలి రత్తమ్మ, అంజమ్మ, ఎంకమ్మ, సుబ్బమ్మ రాత్రి చేసిన వంటపాత్రలు కడగడం మొదలుపెట్టారు. వాళ్లను ఊళ్లోవాళ్లు రత్తీ, అంజీ, ఎంకీ, సుబ్బీ అని పిలుస్తారు. వాళ్లు ఎలాంటి నిరసన లేకుండా మామూలుగానే ఆ పిలుపులకు స్పందిస్తారు.

పెద్దపెద్ద డేగిశాలు, కాగులూ, గిన్నెలూ, బకెట్లూ, గరిటెలూ ఒకటేమిటి, ఒక ట్రాక్టర్ లోడు కంటే ఎక్కువే వున్నాయి.

నడివీధిలోనే వాళ్లు ఆ వంటపాత్రలను శుభ్రం చేస్తున్నారు.

"సరిగా తోమండేయ్. ఎక్కడా ఎంగిలీ, మసీ ఉండకూడదని సామానోడు చెప్పాడు. మళ్లీ వాడితో మాట రాకూడదు" రామనరసయ్య అన్నాడు.

"నువ్వు అట్ట కూకో సామీ! మాకు కొత్తా? ఏమీ వుండవులే!" అంది రత్తమ్మ.

ఏమైనా దొరికితే తినాలని చాలా కుక్కలు అక్కడే కాచుకుని సిద్ధంగా వున్నాయి. రామనరసయ్య కూడా సిద్ధంగానే వున్నాడు దుడ్డు కర్ర తీసుకుని, వాటిని అక్కడికి రానీయకుండా తరుముతూ. ఆయన తరిమిన తర్వాత కొంతదూరం పోయినట్లే పోయి, మళ్లీ ఆయన వెంటే వెనక్కి తిరిగి వస్తున్నాయి. ఎంగిలి నీళ్లయినా దొరుకుతాయని వాటి ఆశ వాటిది.

వాళ్ల పనిని ఆజమాయిషీ చేస్తూ, కుక్కల్ని తరుముతూ ఆయనకూడా నడివీధిలో కుర్చీమీద ఆసీనుడయ్యాడు.

"ఏరా భోజనాలు ఎట్టా వున్నాయి? ఊళ్లో ఏమనుకుంటున్నారు?" అటుగా వెళ్తున్న ఒకతన్ని పిలిచి అడిగాడు రామనరసయ్య.

"బెమ్మాండంగా వున్నాయి పెదనాన్నా భోజనాలు. ఇంతమాత్రం పెళ్లి మన వూళ్లో ఎవరూ చేయలేదనుకో. అబ్బో... ఎన్ని రకాలు... ఐసుక్రీములు ఒక్కోడయితే రెండు మూడుకూడా తిన్నాడు".

"తింటే తిన్నారు కానీయిరా! ఏం లోటు లేకుండా అంతా బాగా జరిగింది. అది చాలు. కూరలు కూడా అన్నీ కుదిరినట్టేగా?"

"కూరలకేం? అదిరిపోయేట్టు చేశారు పెదనాన్నా! అన్ని కూరల్లోనూ జీడిపప్పే! బొగు రుచిగా వున్నాయిలే కూరలు కూడా. భోజనాలు ఫస్టుక్లాసుగా వున్నాయి".

"ఒకరి కంటే మిగులుగా వుండాలి తప్ప వేటి దగ్గరా తగ్గొద్దని మా వోడు చెప్పాడు. బాగాలేవు, బాగా పెట్టలేదు.. అనే మాట రానీయకూడదన్నాడు. ఎంత ఖర్చయినా ఎనకాడొద్దన్నాడు. అన్నీ బాగున్నట్టే కదా!"

"తిరుగులేదు పెదనాన్నా! వంక పెట్టే పనేలేదు. అన్నీ ఏమున్నాయిలే!" అంటూ అతను అక్కడే ఉన్న మరో కుర్చీమీద సెటిలయ్యాడు.

ఇంటినిండా బంధువులున్నారు. కొందరు ప్రయాణానికి సిద్ధమౌతున్నారు. ఆడవాళ్లు టిఫిన్ తయారీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రామనరసయ్య చుట్ట ముట్టించుకుని, ఒక కుర్చీమీద కూర్చుని, మరో కుర్చీలో కాళ్లు బారజాపుకుని వచ్చేపోయే వాళ్లతో మాటలు మొదలుపెట్టాడు.

"ఏరా నరసయ్యా... పంచే చొక్కా బెమ్మాండంగా ఉన్నాయిరా! పెళ్లికొడుకు మాదిరిగా వున్నావు" చెంబు తీసుకుని పోతున్న ఒక వయసు మళ్లినాయన రామనరసయ్యను పలకరించాడు.

"బెమ్మాండంగా వుండక... నాకేం మామా? ఎవరన్నా పిల్లనిస్తారేమో చూడు, మళ్లీ పెళ్లి చేసుకుంటా!"

"ఏయ్యో... ఎక్కడి పనులు అక్కడే వున్నాయి. తీరిగ్గా కూర్చుని మీటింగ్ పెట్టావు, వెళ్లి టెంటువాళ్లను పిలుచుకురా. వచ్చి టెంట్లు ఊడదీస్తారు. అడ్డంగా వున్నాయి, ఎందుకింకా?" అంటూ ఆయన భార్య లక్ష్మి ఇంట్లో నుండి వచ్చింది.

"కుర్రాడు మళ్లీ పెళ్లి చేసుకుంటాడంటమ్మాయ్! పిల్లని చూడమంటున్నాడు"

"చేసుకుంటాడు, ఎందుకు చేసుకోడూ? మనవడూ, మనవరాళ్లూ పెద్దోళ్లు అవుతుంటే ఇంకా ఆయనకు ఎకసెకాలు తగ్గలా!"

"కొడుకు సంపాయిచ్చి పడేత్తన్నాడు. వీడి పని కుశాలుగా వుంది" అంటూ నవ్వుతూ

'నీకు తెలియదు. నువ్వు వూరుకోరా! ఇయ్యాల మనం ఇస్తే రేపు ఇంకొకర్ని కూడా వీళ్లు అట్నే అడుగుతారు. ఉన్నవాళ్లు వుంటారూ, లేనివాళ్లూ వుంటారూ! రేపు వాళ్లు మనల్ని తిట్టుకుంటారు. మనం పెంచామని! అట్ట ఇయ్యకూడదు"

"నువ్వు పెంచేది ఏంది మామా? నెల రోజుల్నుంచీ నూట యాభై తీసుకుంటుంటే!"

"శుభకార్యం జరిగిన ఇంట్లో అలగా గుంపుతో తగాదా ఎందుకూ? నూటఇరవై లెక్కన తీసకపోండే! రేత్రి మిగిలినయి ఒక్కొక్కరూ మూడు నాలుగు బకెట్లు తీసకపోయూరు మీరు. మనిషిని బట్టి పోవాలి!" అంది రామనరసయ్య భార్య.

"నువ్వేందే మళ్లీ ఇరవై రూపాయలు పెంచావూ?" భార్యమీద కయ్యిమన్నాడు.

వెళ్లిపోయాడు ఆయన.

రామనరసయ్యకు ఒక కూతురూ, కొడుకూ! కూతురికి ఎనిమిదేళ్ల క్రితమే పెళ్లి చేశాడు. ఆమెకి కూడా ఒక కూతురు, కొడుకూ.

రామనరసయ్య ఆస్తి పరంగా పెద్ద ఉన్నవాడేంకాదు. లేమిడి కుటుంబమే! అయితే అప్పో సప్పో చేసి కొడుకును చదివించుకున్నాడు.

కొడుకు ఉద్యోగం సంపాదించుకుని కంపెనీ తరపున రెండుసార్లు విదేశాలకు వెళ్లి కొంత డబ్బు కూడబెట్టుకున్నాడు.

"అమ్మా.. మరే అమ్మాయి ఏడుత్తందే! తాత నిన్ను పిలచక రమ్మన్నాడు" అంటూ ఏదేళ్ల పిల్లవాడు గిన్నెలు కడుగుతున్న అంజమ్మ దగ్గరికి వచ్చాడు.

"నువ్వు పోయిరామ్మో! పోయి సంటిదానికి పాలిచ్చిరా!" అంది అంజమ్మని వాళ్లత్త ఎంకమ్మ.

అంజమ్మ బాలింత. రెండు నెలల పసికందు ఇంటిదగ్గర ఉంది. ఆమెకి వళ్లంతా పచ్చిపుండు మాదిరిగా వుంది. అయినా పని పోగొట్టుకోవడం ఇష్టంలేక, నాలుగు రూపాయలు వస్తాయిలే అనే ఆశతో వచ్చింది.

"పాలిచ్చి ఇప్పుడే వస్తా" మిగతా వాళ్లకు చెప్పి, వచ్చిన పిల్లాడి చేయి పట్టుకుని తీసుకుపోయింది అంజమ్మ.

ఎరుకల వాళ్ల గుడిసెలు అక్కడికి దగ్గరే. నాలుగిళ్లు, నీళ్లు లేని వాగు దాటితే వాళ్ల గుడిసెలే.

వంటసామాన్లు మొత్తం కడగడం మధ్యాహ్నానికి పూర్తయింది. మధ్యమధ్యలో ఇంట్లో వాళ్లు చెప్పే పనులు చేస్తుంటే.

"ముందు అన్నాలు తినండే! నడిజాము అయింది" రామనరసయ్య భార్య లక్ష్మి చెప్పింది వాళ్లకు.

పని చేసి, ఆకలిగా వుండడంతో ఎప్పుడా అని ఎదురుచూస్తున్న వీళ్లు తిండికి కూర్చున్నారు.

ఇప్పుడు వండిన అన్నమూ, పాడవకుండా వున్న రాత్రి మిగిలిపోయిన కూరలూ వీళ్లకు పెట్టారు. తిన్న తర్వాత లేచి చీపుర్లు తీసుకున్నారు. రాత్రి వీధిలోనే భోజనాలు ఏర్పాటు చేశారు. వీధినిండా ప్లాస్టిక్ గ్లాసులూ, ఎంగిలి విస్తర్లూ. చీదర చీదరగా వుంది. అంతా వాటిని శుభ్రం చేయడానికి కదిలారు.

"ఇద్దరు ఇటురాండే! ఇంట్లో చాలా పని వుంది" లక్ష్మి ఇద్దర్ని ఇంట్లోకి తీసుకుపోయి బండెడు అంట్లు వేసింది. సాయంత్రానికి ఎటోళ్లు అటు వెళ్లిపోయారు. తుఫాను వెలిసినట్లయింది.

ఎరుకల వాళ్ల పని కూడా అయిపోయింది.

"డబ్బులియ్యి మామా... ఎల్లామూ!" అడిగింది వాళ్లకు మేస్త్రీగా వుండే రత్తమ్మ.

"ఇప్పుడేం డబ్బులే రత్తీ? రేపొచ్చి తీసకపో!"

"కాదుమామా.. వారాలోడికి నిన్ననే కట్టాల్సిన డబ్బులు. ఒకరోజు ఆలిస్సెమయితే వాడు ఊరుకోడు. ఇంటిమీదకొచ్చి జాతర చేస్తాడు"

"మొత్తం ఎంతమందే?"

"మొదటిరోజు ఇద్దరూ, మొన్న ఇద్దరూ, నిన్న పదకొండు మందిమీ, ఇయ్యాల నలుగురిమీ, మొత్తం పంతొమ్మిది మంది మామా!"

"ఏమే?" అని పక్కనే వున్న భార్యవైపు చూశాడు.

"అంతేలే" అందామె.

"కూలీ ఎంతే?" అడిగాడు వాళ్లని.

"రోజుకు మడిసికి నూటయాభై రూపాయలు మామా!"

"ఏందీ... నూటయాభై రూపాయలే?" ఆశ్చర్యపోతూ నోరు తెరిచాడు.

"ఎక్కడైనా అంతే తీసుకుంటున్నాం మామా!"

'ఏంది? డబ్బులా, చిల్ల పెంకులా?"

"మీరొక్కరే కాదుగా మామా! పెళ్లిళ్లు అయినా, పేరంటాళ్లు అయినా, దినాలు అయినా, ఏబంతైనా విస్తరాకులు ఎత్తేసినోళ్లకి నూటయాబయ్యే కూలి!"

"పని చేసేవాళ్లు, మీరొక్కరే కాకుండా ఇంటిల్లిపాదీ వచ్చి మూడు పూటలా మూడు బొచ్చెలు తింటారు. ఇంకా ఇంటికి తీసకపోతారు. తిండి పెట్టి రోజుకు అంత కూలీ ఇచ్చేది ఎక్కడే? ఎక్కడన్నా వుందీ?"

"ఎన్ని బంతులకి పోవడంలా మేము? మా పనే అది. ఎవుర్నైనా కనుక్కునే ఇయ్యి మామా?"

"ఛ నోర్ముయ్యవే! అడిగేదానికయినా హద్దు వుండాల్సిన పని లేదంటే? కలుపుకు పోతే ఎంత ఇస్తన్నారే కూలీ? అరవై రూపాయలు! అంతకంటే ఎక్కువ ఇయ్యమంటావేంది, పైగా తిండిపెట్టి!"

"కలుపుకీ, దీనికీ సంబంధం లేదులే మామా! కలుపుకి ఎండబడి పోతే మళ్లీ పొద్దు కొండల్లో పడేతలికి ఇంటికి వస్తారు. మేం అట్ట కాదుగా! ఏకువ జామునుంచీ అద్దరేత్తిరి దాకా చేస్తాం. రేత్రి బంతి మన ముందోళ్లు, ఎనకోళ్లు తినేసరికి ఒంటి గంట అయింది. కలుపువాళ్లతో వంతు పెడితే ఎట్ట?"

"అయితే ఇంకొక పది రూపాయలు తీసుకోండి. అంతే గానీ, నోరు పట్టకుండా అడిగితే ఏమనీ?"

"అదేంది మామా అట్టంటావూ? అందరి దగ్గరా అంతే తీసుకోవడం! నీ దగ్గర కొత్తగా ఏమన్నా తీసుకుంటున్నామా?"

"నేను మాత్రం వందకంటే ఎక్కువ ఇయ్యనే!"

"రెండేళ్ల నుండీ నూటయిరవై తీసుకుంటున్నాం. నువ్వు ఇయ్యాల వంద ఇస్తానంటే ఎట్ట? నెల రోజుల నాడే నూటయాభై చేసాం. నూటయాభై అని పేరేగానీ అక్కడ ఏం వస్తన్నయి? అన్ని వస్తువుల ధరలూ పెరిగే!"

"నాకు అయ్యేం తెలియదే! వంద లెక్కన తీసకపొండి"

"చాకిరీ చేసిన వాళ్ల దగ్గర బేరం చేస్తే ఎట్టమామా? నాలుగు మంత్రాలు చదివినందుకు రేత్రి బేమ్మడికి ఐదువేలా నూటపదహార్లు ఇచ్చారే! కూటికి దికాణా లేని మాదగ్గరా బేరాలు? పనోళ్లం అనేగా లోకువ?"

అంతలో కొడుకు ఇంట్లోనుండి బయటికి వచ్చాడు.

"వాళ్లు అడిగినంత ఇవ్వు నాన్నా! పని వాళ్లతో ఎందుకు గొడవ?"

"నీకు తెలియదు. నువ్వు వూరుకోరా! ఇయ్యాల మనం ఇస్తే రేపు ఇంకొకర్ని కూడా వీళ్లు అట్నే అడుగుతారు. ఉన్నవాళ్లు వుంటారూ, లేనివాళ్లూ వుంటారూ! రేపు వాళ్లు మనల్ని తిట్టుకుంటారు. మనం పెంచామని! అట్ట ఇయ్యకూడదు"

"నువ్వు పెంచేది ఏంది మామా? నెల రోజుల్నుంచీ నూట యాభై తీసుకుంటుంటే!"

"శుభకార్యం జరిగిన ఇంట్లో అలగా గుంపుతో తగాదా ఎందుకూ? నూటఇరవై లెక్కన తీసకపోండే! రేత్రి మిగిలినయి ఒక్కొక్కరూ మూడు నాలుగు బకెట్లు తీసకపోయారు మీరు. మనిషిని బట్టి పోవాలి!" అంది రామనరసయ్య భార్య.

"నువ్వేందే మళ్లీ ఇరవై రూపాయలు పెంచావూ?" భార్యమీద కయ్యిమన్నాడు.

"నోర్మూసుకుని ఇయ్యి" ఆమె వురిమింది.

"అదేందమ్మా..." అని వాళ్లు కొద్దిసేపు నసిగి, మొండికిపడి, చివరికి ఆ డబ్బు తీసుకుని దారిపట్టారు.

"చూడేయ్, ఆయన పెళ్లాం ఏమంటందో! బ్రౌది! మనం అలగా గుంపంట! పని చేశాం. డబ్బులడిగాం. మనం అలగా గుంపా? పని చేసినోళ్లకి డబ్బులు ఇయ్యటానికి పేచీలు పెట్టే, తగాదాపడినోళ్లు అలగా గుంపవుతారు కానీ, మనమా?" అంది సుబ్బమ్మ.

"పెట్టే దగ్గర వేలూ, లచ్చలూ బడాయిగా పెడతారు. ఎక్కడెక్కడివాళ్లో తిన్న ఎంగిలి విస్తళ్లు ఎత్తేసిన మన దగ్గరికి వచ్చేసరికి పేచీలు పెట్టి గీచి గీచి బేరాలు చేత్తాడు పెతోడు. మొన్నొకడు తాగి ఆ విస్తట్లోనే బండెడయితే కక్కుకుని రోతరోత చేసి పెట్టాడు. అదంతా ఎత్తడంలా మనం. మన దగ్గర ఎందుకంటా బేరాలూ?" అని దారిలో తిట్టుకుంటూ వాళ్ల గుడిసెలకు చేరుకున్నారు. ★



జిలేబి

కావలసిన పదార్థాలు

మైదాపిండి- పావుకేజీ,
మిఠాయి రంగు - అరస్పూను.
కొట్టిన బియ్యంపిండి - 3 స్పూన్లు,
చక్కెర - పావుకేజీ, నెయ్యి - 350 గ్రా,
సోడా- చిటికెడు, పుల్లటి మజ్జిగ - అరకప్పు,

తయారుచేసే విధానం

సాయంత్రం జిలేబి చేస్తామనగా పొద్దుటే మైదాపిండిలో బియ్యంపిండి, సోడా కలిపి, పుల్లటిమజ్జిగ పోసి, నీళ్ళు పోస్తూ ఒక గిన్నెలో గరిట జారుగా కలుపుకోవాలి. పిండి బాగా పులిసి, బుర బురలాడుతూ వుండాలి. వేళ్ళతో పట్టుకుంటే పిండి తీగలాగా రావాలి, లేకపోతే మరికొంతసేపు నాననివ్వాలి. నానిన పిండిని మజ్జిగ కవ్వంతో బాగా చిలకాలి. అప్పుడు నురగమాదిరి వస్తుంది. పిండిని ఎంత బాగా చిలికితే అంత చక్కగా జిలేబి వస్తుంది. ఒక వెడల్పాటి మూకుడులో నెయ్యిపోసి, పొయ్యి మీద పెట్టాలి. ఖాళీ కొబ్బరిచిప్పకు అడుగున ఒక చిన్న రంధ్రం చేసి, అందులో పిండి వేసి రెండు చుట్లు తిప్పాలి. అలా ఒక జిలేబి అయిపోగానే వేలు అడ్డం పెట్టాలి. తర్వాత వేలు తీసేసి మరో జిలేబి వేయాలి. జిలేబి వేసేటప్పుడు కొబ్బరిచిప్పను మూకుడుకు ఎంత ఎత్తులో పట్టుకుంటే జిలేబి అంత నైసుగా వస్తుంది. ముందుగానే పంచదారతో లేతపాకం పట్టి పక్క పొయ్యి మీద సన్నని సెగమీద వుంచాలి. ఒక అరస్పూను మిఠాయి రంగును పాలల్లో కలిపి పాకంలో వేస్తే జిలేబికి రంగు అంటుకొని చాలా బావుంటుంది. గోధుమ రంగులో వేగిన జిలేబిని పాకంలో వేసి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇవి నాలుగైదు రోజుల వరకూ పాడవకుండా వుంటాయి.

కాజాలు

కావలసిన పదార్థాలు

మైదాపిండి- పావుకేజీ, పంచదార - అరకేజీ,
నెయ్యి - పావు కేజీ, పేరిన నెయ్యి - అర కప్పు,
తినే సోడా - అరస్పూను, బియ్యంపిండి - 5 స్పూన్లు.

తయారుచేసే విధానం

మైదాపిండిలో పేరిననెయ్యి, తినేసోడా, నీళ్ళు వేసి గట్టిగా కలుపుకోవాలి. దానిని 2 గంటలు నానబెట్టాలి. నానిన పిండిని పీటమీద వేసి బాగా మర్దనా చేయాలి. ఈ పిండిని పెద్ద పెద్ద ఉండలు చేసి, చపాతీలు లాగా వత్తాలి. పేరిన నేతిలో బియ్యంపిండి కలిపి చపాతీపై రాయాలి. చపాతీని అంగుళం వెడల్పున ఉండేటట్లు చుడుతూ, మడత మడతకు బియ్యంపిండి ముద్దను రాయాలి. చుట్టిన చపాతీని అంగుళం పొడవుండేట్లు ముక్కలుగా కోసుకోవాలి. ఈ ముక్కలను పళ్లెంలో వుంచుకోవాలి. పావుకిలో పంచదారలో కొద్దిగా నీళ్లపోసి, పొయ్యిమీద పెట్టి లేతపాకం పట్టి వుంచుకోవాలి. మూకుడులో నెయ్యికానీ, డాల్డాకానీ పోసి కాగిన తరువాత ఇంతకుముందు చేసిపెట్టుకున్న ముక్కలను దోరగా వేయించి పాకంలో వేసి, తీసి మళ్లీ పళ్లెంలో వుంచాలి. అలా అన్నీ పాకంలో వేసి తీయాలి. మిగిలిన పంచదారతో పాకంపట్టి కాజాలను మళ్లీ ఈ పాకంలో వేసి తీయాలి. రెండుసార్లు పాకంలో వేయటం వల్ల చాలా రుచిగా వుంటాయి. 10 రోజుల వరకూ నిల్వ వుంటాయి.

మైదా లడ్డు

కావలసిన పదార్థాలు

మైదాపిండి - అరకేజీ, నెయ్యి- అరకేజీ,
పంచదార - పావుకేజీ, యాలకులు - 4,
జీడిపప్పు - 10, కిస్‌మిస్ - 10, పాలు- అరకప్పు.

తయారుచేసే విధానం

మైదాపిండిలో ఉప్పు వేసి నీళ్ళుపోస్తూ పూరీ పిండిలా కలుపుకోవాలి. దీనిని రెండుమూడు గంటలు నానబెట్టాలి. నానిన తరువాత ముద్దను బాగా మర్దనా చేయాలి. ఇప్పుడు ఈ పిండితో పెద్ద ఉండలను చేసి రొట్టెలు చేయాలి. రొట్టెలను డైమండ్ ఆకారంలో ముక్కలుగా చేయాలి. మూకుడులో నెయ్యి పోసి ఈ డైమండ్ ఆకారం ముక్కలను వేయించుకోవాలి. తరువాత వాటిని రోట్లోవేసి మెత్తగా దంచాలి. పంచదారను మెత్తగా (పిండి) పొడి కొట్టాలి. యాలకులు కూడా పొడి చేయాలి. దంచిన డైమండ్స్ పొడి, పంచదార పొడి, యాలకుల పొడి, జీడిపప్పు, కిస్‌మిస్‌లు అన్నిటినీ ఒక వెడల్పాటి గిన్నెలో కలిపి పాలు తడిచేసుకొంటూ లడ్డూలు చేసుకోవాలి. ఒక అరగంట ఆరిన తరువాత డబ్బాలో పెట్టి నిల్వ చేసుకోవచ్చు.

అమృత గుటకలు

కావలసిన పదార్థాలు

బియ్యం - 1 కప్పు, పాలు 2 కప్పులు,
పంచదార - 1 1/2 కప్పు, నెయ్యి - ఒక కప్పు,
యాలకులు - 6, సీమ బాదంపప్పు, కుంకుమ పువ్వు.

తయారుచేసే విధానం

బియ్యం ఒక గంటసేపు నానిన తరువాత మెత్తగా, మరీ పలచగా కాకుండా రుబ్బుకోవాలి. సీమ బాదంపప్పులను 15 నిమిషాలు నానపెట్టి పైతోలును తీసి సన్నగా తరిగి నేతిలో వేయించుకోవాలి. యాలకులను మెత్తగా పొడి కొట్టుకోవాలి. రుబ్బినపిండి, పాలు, పంచదార అన్నీ ఒక గిన్నెలో వేసి పొయ్యి మీద సన్నని సెగపై వుంచి, అడుగంటకుండా నెయ్యి పోస్తూ గరిటతో తిప్పాలి. యాలకుల పొడి, కొంచెం పాలల్లో కుంకుమ పువ్వు కలిపి అందులో వేయాలి. తరువాత దాన్ని నెయ్యి రాసిన పళ్ళెంలో పోసి, చల్లారిన తరువాత ముక్కలు కోసుకోవాలి. ★



జిలేబి



అమృత గుటకలు



మైదాలడ్డు



కాజాలు

దీపికా పదుకొనె



చొట్టబుగ్గల సుందరి. పొడగరి. సొగసరి. సూపర్ మోడల్‌గా కెమెరా ముందుకొచ్చి హీరోయినై బాలీవుడ్‌లో వెలుగులు విరజిమ్ముతోంది. మరి ఈ గడసరి బయోడేటా ఏంటో ఓ లుక్కేద్దామా!

పుట్టినతేది : జనవరి 5, 1986

రాశి : మకర రాశి

పుట్టిన ప్రదేశం : మంగుళూరు, కర్నాటక

ఎత్తు : 5 అడుగుల 9 అంగుళాలు

చదువు : బెంగుళూరులోని సోఫియా హైస్కూలు, మౌంట్ కార్మెల్ కాలేజి

అభిరుచులు : సంగీతం వినడం, సినిమాలు చూడడం, తినడం, పడుకోవడం

కుటుంబ సభ్యులు:

తండ్రి : ప్రకాశ్ పదుకొనె (మాజీ వరల్డ్ బ్యాడ్ మెంటన్ ఆటగాడు)

తల్లి : ఉజ్జల పదుకొనె

సోదరి : అనిష

ప్రదేశం : ఫ్రెంచ్ రివెరియా

నచ్చిన పర్‌ఫ్యూమ్ : ఎస్కాడా

అవార్డులు :

ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ ఫిమేల్ డిబట్, ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ యాక్ట్రెస్ నామినేషన్, కింగ్‌ఫిషర్ ఐదవ వార్షికోత్సవ ఫ్యాషన్ అవార్డుల్లో ఫిషర్ మోడల్ ఆఫ్ ద ఇయర్, ప్లేబాయ్ మోడల్ మ్యాగజైన్ కవర్ విజేత, ఐడియా జీ ఫిల్మ్ ఫేర్ అవార్డులు (ఫిమేల్ మోడల్ ఆఫ్ ది ఇయర్, ఫ్రెష్ ఫేస్ ఆఫ్ ది ఇయర్).

ఇప్పటీ వరకూ మోడల్‌గా చేసిన యాడ్స్ :

లిరిల్, డాబర్ లాల్ పౌడర్, క్లోసప్ టూత్‌పేస్ట్, లింకా, జువెలరీ ఎగ్జిబిషన్ బ్రాండ్ అంబాసిడర్

సినిమాలు :

తొలి చిత్రం : ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వం వహించిన 'ఐశ్వర్య' (కన్నడ సినిమా-2006). ఉపేంద్ర సరసన కథానాయికగా.

డిబట్ హిందీ సినిమా : ఓమ్ శాంతి ఓమ్‌లో షారూక్ ఖాన్ సరసన

ఆసక్తికరమైన విషయాలు : దీపికా పదుకొనె రాష్ట్రస్థాయి బ్యాడ్‌మెంటన్ ప్లేయర్. భరతనాట్యంలో శిక్షణ పొందింది.

★

ఇష్టమైన పానీయం



నిమ్మరసం



ఇష్టమైన వంట : థాయ్

ఇష్టమైన దుస్తులు చీర

ఇష్టమైన సినిమాలు

దిల్, దేవదాసు



ఇష్టమైన నటులు

షారూక్ ఖాన్, అమీర్ ఖాన్



ఇష్టమైన నటీమణులు

రాణి ముఖర్జీ, ప్రీతి జింటా, సుస్మితా సేన్.

క్రైమ్ కథ

గురి తప్పింది

- యర్నాగుల సుధాకరరావు

> **బయట గన్‌మేన్, లోపల భూపేష్ ఇదే మంచి సమయం అనుకుని గన్‌తో కాల్చాడు స్టీఫెన్. వరుసగా నాలుగు రౌండ్లు కాల్చి పారిపోయాడు. గన్‌శబ్దం అయిన వెంటనే బయటున్న గన్‌మేన్ పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లాడు. అక్కడ భూపేష్ చెవులు మూసుకుని నేలమీద కూర్చుని కనిపించాడు. అతడిపక్కనే రెస్టారెంటుకు వచ్చే కస్టమర్ నెత్తురుమడుగులో పడి వున్నాడు.**

"వాడు చావడుగాక చావడు. ఇదే ఆఖరి ఎటెమ్ట్, ఒకణ్ణి చంపడానికి ఇంతగా నేను ఇన్ని ప్రయత్నాలు చేయలేదు. అలా అని వాడేమీ మాకు అందకుండా పోతున్నాడా అంటే కాదు. ప్రతిసారీ దైవికంగా తప్పించుకుంటున్నాడు. నీవు ఇచ్చిన అడ్వాన్స్ నాకుండిపోతుంది. మిగతా బ్యాలెన్సు పని పూర్తయ్యాక ఇస్తానన్నావు. పని కాలేదు. కనుక ఈ ఎసైన్‌మెంటు వదిలేస్తున్నాను" లేచాడు కిరాయి హంతకుడు స్టీఫెన్.

"అలా అనొద్దు. నీవు తలచుకుంటే జరగనిదిలేదు. మాకు భూపేష్‌గుప్తాతో చాలా గొడవగా ఉంది. ఇంతవరకు నీ ప్లాన్లతో నీవు హత్యాయత్నాలు చేశావు. ఇప్పుడు మేం చెబుతాం. ఆ ప్రకారం చెయ్యి. కచ్చితంగా భూపేష్ నేలకొరిగిపోతాడు. ఇప్పుడు వాడు చస్తే మా మీదకు అనుమానం రాదు. రెండు కార్మిక సంఘాల మధ్య చిచ్చు పెద్దదైంది. నీవు ఈ రాత్రి ఒల్డు కలకత్తాలో చిన్న రెస్టారెంటు వద్ద రెడీగా ఉండు. అక్కడ భూపేష్‌ను మావాడు నీకు పరిచయం చేస్తాడు. వాడికి పీకల వరకు తాగించేయ్. వాడు ఎంత మంచి లీడరో అంత తాగుబోతు. ఆ వీక్‌నెస్‌ను మనం వాడుకుందాం. తాగాక ఆటోలో వాణ్ణి ఇంటివద్ద చేర్చుతాను అని చెప్పి "హుగ్లీనది ఒడ్డున నీ పని కానిచ్చేయ్" చెప్పాడు ఒక కార్ఖానా యజమాని చందూలాల్ బిహనీ.

స్టీఫెన్ నవ్వాడు. "ఆఖరికి నా కిరాయి బతుకు ఎక్కడికి దిగజారిందంటే ఎటూ తేల్చుకోలేని విధంగా తయారుచేశాడు ఆ భూపేష్‌గాడు. వాణ్ణి మీరు చెప్పినట్లు హతమార్చను. నా రూట్‌లోనే చంపుతాను" అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి భూపేష్‌కోసం స్టీఫెన్ వెతకనిచోటు లేదు. చివరికి ఒక రెస్టారెంటు వద్ద తూలుతూ కనిపించాడు భూపేష్. స్టీఫెన్ కత్తి తీశాడు. వేసేద్దాం అని కసితో అటుగా కదిలాడు. భూపేష్‌ను సమీపించాడు. అతని పక్కనే ఒక గన్‌మేన్ కాపలాగా ఉన్నాడు. అతడిమీద పలు హత్యాప్రయత్నాలు జరగడంతో పోలీసులు కాపలాగా గన్‌మేన్‌ను పెట్టించారు. వారి పక్కనే నిలబడ్డాడు స్టీఫెన్. అక్కడ వారి విచిత్రమైన సంభాషణ విన్నాడు.

"మీరు ప్రమాదంలో ఉన్నారని కదా మా పోలీసు డిపార్టుమెంటువారు ఇలా నన్ను కాపలాగా పెట్టారు. మీరేమో అర్ధరాత్రి వరకూ మద్యం మత్తుకోసం వెంపర్లాడుతున్నారు. నన్ను ఏమార్చి ఎటెటో వెళ్లిపోతున్నారు. నేను అర్ధరాత్రి వరకు మేలుకుని ఉండలేను. నిద్ర ముంచుకొస్తోంది. ఎందుకొచ్చిన తాగుడు! ఒక వైపు నీకు మృత్యువు పొంచి ఉన్నది. ఏమైనా అయితే ఇక్కడ బెంగాల్ ప్రభుత్వం నన్ను క్షమించదు. పదండి పోదాం" గన్‌మేన్ భూపేష్‌ను బతిమాలాడు.

"సెక్యూరిటీ వద్దు అంటే మీ పోలీసాఫీసర్లు కావాలని నిన్ను నాకు తగిలించారు. నన్నెవరు చంపుతారు? కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసే ఆ యాజమాన్యాలు చంపితే చంపాలి. వారే ఏ కిరాయి గూండాకో డబ్బిచ్చి చంపిస్తారు. నీలాంటి గన్‌మేన్‌లు ఏం చేస్తారు? నన్ను హత్యచేస్తుంటే ఎటాక్ చేస్తారా? అంటే లేదనే చెప్పాలి. నీవో ఉత్సవ విగ్రహానివి. నన్ను చంపిన తర్వాత కంటితుడుపు దర్యాప్తు చేసి, నా ముక్కూమొఖం తెలీనివాణ్ణి కోర్టుబోనులో నిలిపి చేతులు దులుపుకుంటారు. వాడు మీ బలవంతాన చంపానని ఒప్పుకున్నా కోర్టుకు సాక్ష్యాలు కావాలి. ఏదో శిక్షపడ్తుంది. ఇలా ఉంటాయి మా కార్మికుల హత్యలు, వాటివెనుక న్యాయాలు. కనీసం నిద్ర పోయేటప్పుడు మత్తుగా పడుకోవాలి. అందుకే తాగుతున్నాను".

"అయ్యా నేను చెప్పేది అదికాదు. ఇప్పుడు మిమ్మల్ని ఎవరైనా ఎటెమ్ట్ చేస్తే నేను ఇరుక్కుంటాను. అర్ధరాత్రి వరకు బయటేం చేస్తున్నావని అధికారులు నన్ను వేపుకుతింటారు, అదే నా భయం. కనుక మనం వెళ్లిపోదాం" తొందరచేశాడు గన్‌మేన్.

స్టీఫెన్ ఇదంతా విని కత్తి జేబులో పెట్టుకుని, హేండ్‌గన్ తడుముకున్నాడు. మెల్లగా తీసి దానిమీద జేబురుమాల్ వేశాడు. అప్పుడే భూపేష్ గన్‌మేన్‌తో చెప్పాడు. "నీ డ్యూటీ ఎంతవరకో నాకు ఇచ్చిన షీట్‌లో రాసుంది. అంతవరకు నువ్వు పనిచేయ్. రాత్రి నువ్వు నా ఇంట్లో ముందు గదిలో నిద్రపోతుండగా నేను నీకు చెప్పకుండా బయటికి వెళ్లిపోయాను అని చెప్పుకో! నేను మరింత మద్యం పుచ్చుకుని వస్తాను" ఖరాఖండిగా చెప్పాడు. ఆ గన్‌మేన్ చిరాగ్గా చూసి బయటికి వెళ్లి రోడ్డుమీద నిలబడ్డాడు. లోపల అంతా మద్యంగాళ్లే ఉన్నారు. 'పోలీసుజాబ్ ఇంతే!' అని నిద్రొస్తుంటే బలవంతంగా ఆపుకున్నాడు.

బయట గన్‌మేన్, లోపల భూపేష్ ఇదే మంచి సమయం అనుకుని గన్‌తో కాల్చాడు స్టీఫెన్. వరుసగా నాలుగు రౌండ్లు కాల్చి పారిపోయాడు. గన్‌శబ్దం అయిన వెంటనే బయటున్న గన్‌మేన్ పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లాడు. అక్కడ భూపేష్ చెవులు మూసుకుని నేలమీద కూర్చుని కనిపించాడు. అతడిపక్కనే రెస్టారెంటుకు వచ్చే కస్టమర్ నెత్తురుమడుగులో పడి వున్నాడు. లక్కీగా మళ్లీ బుల్లెట్లు తప్పిపోయాయి. అంతలోనే బయట కేకలు వినిపించేసరికి అంతా అటు వెళ్లారు. స్టీఫెనును చాలామంది పట్టుకుని చావతన్ని పెట్రోలింగ్ వాన్‌కు అప్పగించేశారు. ఆ తరువాత తీగలాగితే డొంక కదిలినట్లు అంతా బయటపడింది. కార్మిక యజమాని అరెస్టుకు దారితీసింది.

స్టీఫెన్ పోలీసుల ముందు తన నేరాన్ని ఒప్పుకున్నాడు. "నా గురి తప్పదు. కానీ, భూపేష్‌కు అంతులేని అదృష్టం ఉంది. కనుకనే అతడు ప్రతిసారీ తప్పించుకున్నాడు. ఒక్క బుల్లెట్ కూడా తగలకపోవడం ఆశ్చర్యం కలిగించింది. తొలుత నేను భూపేష్‌ను నడిరోడ్డుమీద చంపాలనుకున్నాను. అక్కడ మధ్యాహ్నం ఎవరూ లేరు. బ్యాంకులోంచి వెలుపలికి వచ్చేటప్పుడు చంపాలని నిర్ణయించాను. కానీ, ఒంటరిగా వెళ్లినవాడు పదిమంది కార్మికులతో వచ్చాడు. మరోసారి అతడింటి వద్దనే చంపేద్దామనుకుని ఒక ఆటోలో వచ్చి సిద్ధపడ్డాను. అప్పుడే ఒక పోలీసు వచ్చి ఆటో తీయమన్నాడు. ఇలా ఏడెనిమిదిసార్లు నా గురి తప్పిపోయింది. ప్రతిసారీ ఎవరో చంపాలనుకుంటున్నారని ముందే అతడికి తెలిసిపోతుండేదేమో. తెలియని అదృష్టం అతణ్ణి గన్‌తో కాల్చినపుడు కూడా రక్షించింది. నేను దేవుళ్లను, దెయ్యాలను నమ్మను. అతడు దేవున్ని నమ్మడు. అతడు బతకాలని ఉంది. నా గురి తప్పింది" అని డీలాపడిపోతూ చెప్పాడు.

స్టీఫెన్‌ను, మిల్లు యజమానిని మరుసటి రోజు కోర్టులో నిలిపారు.

★

తాజా అద్భుతాలు

ప్రపంచంలో మనకు తెలియని అద్భుతాలు, వింతలు ఎన్నో ఉన్నాయి. ఆయా ప్రదేశాలు, నిర్మాణాలు, ప్రకృతి అందాలు...వాటి సౌందర్యం చూసి పరవసించిపోవాల్సిందే. శిల్పాల్లా అలా నిల్చుండిపోవాల్సిందే. అవి మన హృదయాన్ని అంతగా హత్తుకుపోతాయి. మన మనసులో చెరగని ముద్ర వేస్తాయి. యునెస్కో అలాంటి కొన్నిటిని గుర్తించి తాజా అద్భుతాల జాబితాలో చేర్చింది. అవే ఇవాళ మీ ముందుకు రంగుల్లో వచ్చాయి మరి. ఆస్వాదించండి.

డోలమైట్స్

చాక్లెట్ హౌస్

వాడెన్ సముద్రం

వాచీల పట్టణం

మౌంట్ వుటై

డోలమైట్స్

ఈ సున్నపురాతి పర్వత శ్రేణులు ఇటలీలో దర్శనమిస్తాయి. పర్వత శిఖరాగ్రాలు 'నీలి నింగిని ముద్దాడుతున్నాయా' అన్నట్టుంటాయి. ఆ పర్వత పాదాల కింద ఆకుపచ్చ లోయలు అందాలలకబోస్తుంటాయి. మంచు కప్పుకుని మెలికెలు తిరిగి ఒయ్యారంగా కనిపించే ఈ లోయలు ఆ ప్రదేశానికి మరింత అందాన్ని చేకురుస్తున్నాయి. సంవత్సరం పొడవునా సందర్శకులతో ఈ ప్రదేశం కిటకిటలాడుతుంది. సందర్శకులు చలికాలంలో స్కేటింగ్, వేసవిలో పర్వతారోహణ, పారాచూట్ ప్రయాణం చేసి ఆనందిస్తుంటారు. పర్యాటకులకు అన్ని సౌకర్యాలూ అందించేందుకు ఆధునిక రిసార్టు పట్టణాల నుంచి సంప్రదాయ గ్రామాల వరకు సిద్ధంగా వుంటాయి.

వాడెన్ సముద్రం

ఆధునిక మానవుడి మూలంగా అదేనండీ మన మూలంగా కలుషితం కాని ప్రకృతి వనరు లేనేలేదనుకోవచ్చు. కానీ వాడెన్ సముద్రాన్ని ఈ జాబితా నుంచి మినహాయించవచ్చు. ఇది విభిన్న ప్రాణులకు పెట్టింది పేరనుకోండి. ఇది జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలలో ఆవరించి ఉంది. జర్మనీ దక్షిణ తీర ప్రాంతంలో ఈ సముద్రం పొడవునా... కనుచూపు మేర దట్టమైన అడవులు, గడ్డి మైదానాలు, చిత్తడినేలలు, ఇసుక దిబ్బలు కనిపిస్తాయి. నెదర్లాండ్స్‌లో కొన్ని మైళ్ల వరకూ స్వచ్ఛమైన, ప్రశాంతమైన దృశ్యాలు దర్శనమిస్తాయి. అంతేనా! రకరకాల పక్షులు స్వర్గధామం. ప్రతి శీతాకాలంలోనూ 10 మిలియన్ల పక్షులు ఇక్కడకు చేరతాయి. పర్యాటకులకు కనుల విందేకదా.

మౌంట్ వుటై

చైనాలోని ఐదు మిద్దెల పర్వతమైన ఈ వుటై పర్వతం చైనీయలకు చాలా పవిత్రమైంది. ఇది వెయ్యి సంవత్సరాల క్రితంది. ఇక్కడ నెలకొన్న 53 బౌద్ధ ఆశ్రమాలు, నేటికీ పర్యాటకులను అలరిస్తున్న అనేక పురాతన దేవాలయాలు చైనీయుల భవన నిర్మాణ, సాంస్కృక చరిత్రకు నిదర్శనం. ఇది దక్షిణ చైనాలోని

(తరువాయి 16 లో)

ప్రభుత్వ పథకాలు...
దళితుల సంక్షేమానికి సాక్ష్యాలు



డా॥ కె. రోశయ్య
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

"రాష్ట్ర జనాభాలో 16.25% ఉన్న దళితులకు అభివృద్ధి ఫలాలు దక్కాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి డా॥ కె. రోశయ్య పేర్కొన్నారు. దళితుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నూతన విధానాలకు రూపకల్పన చేసిందనీ, పటిష్ఠమైన పథకాలకు తోడుగా కట్టుదిట్టమైన కార్యాచరణతో సాగిపోతోందనీ రోశయ్య అన్నారు. తమ కృషిలో అంకితభావం ఉందనీ, అది డా॥ అంబేద్కర్ కలల్ని సాకారం చేయగలదనీ ఆకాంక్షిస్తూ - దళిత సంక్షేమమే రాష్ట్ర సంక్షేమానికి దిశానిర్దేశం చేయగలదని ముఖ్యమంత్రి నొక్కి వక్కాణించారు. ఆ దిశగా గత అయిదున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి రోశయ్య ప్రస్తావించారు. ఆ దళితుల ఉన్నతే ప్రధాన ఆశయంగా ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పటానికి తనకెంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు."

2004-05 నుంచి 2008-09 వరకు దళితుల సంక్షేమం కోసంసాధించిన లక్ష్యాలు - సాధనలు :

- 2004-05 కొత్తగా 44 ప్రీ-మెట్రిక్ హాస్టళ్ళు, 48 కాలేజీ హాస్టళ్ళు, అలాగే 2008-09లో 400 కాలేజీలు, హాస్టళ్ళ మంజూరు చేయబడినాయి.
- 2006-07లో 25% పెంచిన మెస్ ఛార్జీలను 2007-08లో 40% కుపెంచారు.
- 'సంక్షేమ బాట' కార్యక్రమం క్రింద హాస్టళ్ల మరమ్మత్తులకు 2007-08లో రూ. 27 కోట్లు, 2008-09 లో రూ. 50 కోట్లు కేటాయింపు జరిగింది.
- హాస్టల్ వాసులకు ఉచిత దుస్తులు 2 నుంచి 4 జతలకు పెంచడమైనది.
- 8-10 తరగతులు చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కోసం 5,336 మంది విద్యావాలంటీర్లను ప్రభుత్వం నియమించింది.



- ఒక్కొక్క సంక్షేమ హాస్టలు కాంప్లెక్సు కు 400 మంది విద్యార్థుల చొప్పున రూ.1.68 కోట్ల వ్యయంతో 120 సంక్షేమ హాస్టళ్ళ నిర్మాణానికి అనుమతించారు.. 2008-09లో 200 మంది హాస్టలు సంక్షేమ అధికారాల నియామకానికి అనుమతి.
- ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో ఇల్లు లేని ఎస్. సి. / ఎస్.టి. /బి.సిల కోసం ప్రత్యేకంగా ఇళ్ళ స్థలాలను కేటాయింపు చేసింది.
- 2005-2008 మధ్య దళతులపై సాగిన ఎట్రాసిటీ కేసులను విచారించేందుకు 15 సెషన్స్ కోర్టులను ఏర్పరచింది. ఇంకా అన్ని జిల్లాలలోనూ కోర్టులు ఏర్పాటు చేస్తోంది.

సథకాల వారీగా ప్రయోజనాలు:

పావలావడ్డీ పథకం: ఈ పథకం క్రింద రాష్ట్రంలో 9,33,585 స్వయంసహాయక సంఘాల్లో 28,46,316 మంది దళితులు సభ్యులుగా ఉండటం విశేషమైతే 2008-2009 ఆర్థిక సంవత్సరంలో 6,558కోట్ల పావలావడ్డీ రుణాల్లో దళితులకు రూ. 1,237 కోట్ల పెద్ద మొత్తం అదించడం చెప్పుకోదగ్గ అంశం.

ఇందిరా జీవితభీమా (అమ్ ఆద్మీ యోజన): ఈ పథకం క్రింద మొత్తం 38 లక్షల మంది పేదవారికి బీమా సౌకర్యం కల్పించగా, అందులో 13.12 లక్షల దళితులు లబ్ధిపొందారు.

ఇందిరప్రభ (సమగ్ర భూమి అభివృద్ధి పథకం): ఈ పథకం క్రింద భూమిలేని నిరుపేదలను భూమికి యజమానులుగా చేస్తున్న ప్రభుత్వం గత 5 సం॥లుగా రూ. 377.19 కోట్ల వ్యయంతో 3,51,366 ఎకరాల భూమిని వినియోగంలోకి తీసుకువచ్చింది. లబ్ధిదారుల్లో 1,72,900 దళిత కుటుంబాలు ఉన్నాయి. వీరి కోసం రూ. 184.20 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. అదే విధంగా జాతీయ గ్రామీణ

ఉపాధిపథకం ద్వారా 39.63 లక్షల దళిత కుటుంబాలకు చెందిన భూముల అభివృద్ధి కోసం రూ. 935.14 కోట్లు కేటాయించి దళితప్రగతిదిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది.

రుణమాఫీ పథకం: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని ఎస్.సి. ఫైనాన్స్ కార్పోరేషన్ వివిధ పథకాల క్రింద దళిత కుటుంబాలు తీసుకున్న రుణాలను మాఫీ చేయడం మరో ముఖ్యమైన అంశం. 17,80,842 మంది దళితులు రూ. 1176.82 కోట్ల రుణమాఫీ లబ్ధిని పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2,40,194 మంది దళితులు రూ. 386.23 కోట్ల రుణమాఫీ లబ్ధిని పొందబోతున్నారు.

ఇందిరాక్రాంతి పథకం: 22 జిల్లాల్లో 128 మండలాల్లో గత 5 ఏళ్ళలో 4,539,24 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 5303 మంది కుటుంబాలకు గత 5 ఏళ్ళుగా ప్రయోజనం అందగా, ఇందులో దళిత లబ్ధిదారుల కుటుంబాలు 2799.

జాతీయ ఉపాధి హామీ పథకం: ఈ పథకం ద్వారా 2,65,26,000 మందికి పని లభిస్తే అందులో రూ.1649.29 కోట్ల విలువైన పనులు పొందిన దళితుల సంఖ్య 69,69,162.

పింఛన్లు: 71 లక్షల మందికి ప్రభుత్వం రూ. 800 కోట్లు పింఛన్లు అందించగా వారిలో అధికశాతం అంటే 12,61,124 మంది దళితులే కావడం రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి సాగిస్తున్న కృషికి తార్కాణం.

ఉపాధి కల్పన: 2008-09 ఆర్థిక సంవత్సరంలో 21,296 మంది దళిత నిరుద్యోగయువతకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది.

దళిత పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం: పరిశ్రమలు స్థాపించే దళితులకు ఎలాంటి హామీలూ లేకుండా రూ. 5 కోట్ల వరకు రుణాల మంజూరుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతోంది.

ప్రభుత్వపరంగా దళితుల సర్వతోముఖాభివృద్ధికి సాగుతున్న కృషిని వివరిస్తూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కె. రోశయ్య తెలియచేశారు.

చెట్లులేని పర్వతాలలో పెద్దది. దట్టమైన పొగ మంచులోంచి వెలువడే ఆ సూర్యకిరణాల అందాలు మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి.

పవిత్ర పర్వతం సులామెయిన్

స్టాక్‌లెట్ హౌస్

బ్రస్సెల్స్ భవనాన్ని 20వ శతాబ్దంలో బ్యాంకర్ అడాల్ఫ్ స్టాక్లెట్ కట్టించారు. దాన్ని కట్టడంలో ఆయన తన ఇంజనీర్లకు, బిల్డర్లకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. అందువల్లే ఇంత అద్భుతమైన కట్టడాన్ని మనం చూస్తున్నాం. ఇప్పటికీ స్టాక్‌లెట్ కుటుంబీకులు దీన్ని ఉపయోగిస్తున్నారు. ఈ భవనం మొత్తం ముఖభాగం అరుదైన పాలరాతితో నిర్మించి ఉంటుంది. ఆకర్షణీయమైన పూతలతో ఆకట్టుకుంటుంది. లోపలంతా గుస్తవ్ క్లిమ్ట్, కొలోమేన్ మోసర్ వంటి గొప్ప కళాకారులు వేసిన చిత్రాలతో అలంకరించి ఉంటుంది.

రాజుల సమాధులు

లోరోపెని శిథిలాలు

1000 సంవత్సరాల నాటి రాతి కోటల శిథిలాలు ప్రపంచ సాంస్కృతిక వారసత్వ సంపదగా నిలిచాయి. అక్కడి పరిసరాలను పరిశీలిస్తే అది ఒకప్పుడు ఇది పుత్తడి వ్యాపారానికి కేంద్రంగా ఉండేదనిపిస్తోంది. లొహ్రాన్ ప్రజలు ఒకప్పుడు ఇక్కడ ఆవాసాలు ఏర్పాటుచేసుకున్నారు. ఈ శిథిలాల గోడలు ఆరు మీటర్ల పొడవుంటాయి. పర్యాటకులు గానీ, భవన నిర్మాణ శాస్త్రజ్ఞులు గానీ పశ్చిమ ఆఫ్రికన్ ప్రాంతంలోని ఈ ప్రదేశానికి వెళ్తే అక్కడి చారిత్రక విషయాలన్నీ తెలుస్తాయి.

పవిత్ర పర్వతం సులామెయిన్

16వ శతాబ్దపు నాటి రెండు చర్చ్‌లు సులామెయిన్ పర్వత వాలుపై ఉన్నాయి. ఈ జంట చర్చ్‌లు కిర్గిస్తాన్ ప్రజలకు ఎంతో పవిత్రమైనవి. ఈ ప్రదేశంలో పూర్వపు ఇస్లామికుల, ప్రస్తుత ఇస్లామికుల నాగరికతలు మిళితమై ఉంటాయి. ఇక్కడ పురాతన శిల్పాల కోసం పర్యాటకులు వెతుకుతూనే ఉంటారు. ఇప్పటి వరకూ అలా 101 పురాతన శిల్పాలు దొరికాయి మరి.

హెరిక్యులస్ బురుజు

కారల్ సూప్

పెరూలోని పవిత్ర నగరమైన కారల్‌సూప్‌ని యునెస్కో అద్భుత ప్రదేశాల జాబితాలో చేర్చింది. అత్యంత పురాతన అమెరికా నాగరికతకు ఇది కేంద్రం వంటిది. అలాగే ప్రపంచంలోని అతి ప్రాచీన నాగరికతల్లో ఇది మూడోది. ఆరు అతి గొప్ప పిరమిడ్లు, మట్టి శిల్పాలు, వేడుకల వేదికలు ఇక్కడ వున్నాయి. ప్రాచీన జీవన పద్ధతులను తెలుసుకోడానికి ఇది ఒక ద్వారం వంటిది.

రాజుల సమాధులు

నది ఒడ్డుకు ఎదురుగా వ్యాపించి ఉన్న కొండ అడుగు భాగాన కొరియా రాజుల సమాధులు కనిపిస్తాయి. ఇవి జోసెన్ సంప్రదాయం ఉట్టిపడేలా ఉన్నాయి. ఆ సమాధులు ఎంతో అద్భుతంగా అలంకరించి ఉంటాయి. సమాధులను రక్షించే వారి ఇళ్లు కూడా ఆ సమాధుల దగ్గరే ఉంటాయి. ఇవన్నీ పర్యాటకులను ఎంతగానో అలరిస్తున్నాయి. అంతేకాదు! కొరియాలో ఖనన ప్రదేశాలైన జియోంగు, కోగుర్యో ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో వున్నాయి.


లోరోపెని శిథిలాలు

హెరిక్యులస్ బురుజు

ఒకటవ శతాబ్దంలో రోమన్ నావికులు హెరిక్యులస్ బురుజును చూసి స్పానిష్ ఒడ్డుకు చేరుతున్నామని అనుకున్నారు. అంత స్పష్టంగా కనిపించింది మరి. ఇది 55 మీటర్ల పొడవుంటుంది. ఇది ప్రస్తుతం వున్న రోమన్ లైట్‌హౌస్‌లన్నిటిలోకి ప్రాచీనమైనది. దీనికి 1900 సంవత్సరాల చరిత్ర వుంది. అక్కడి లైట్‌హౌస్ ఇప్పటికీ రోమన్ భవన నిర్మాణ సాంకేతికతకు చిహ్నంగా ఉంది. ఈ హెరిక్యులస్ శిఖరం దగ్గర అంతకంటే పురాతన రాతి శిల్పాలు, ముస్లిమ్ శ్మశాన వాటిక, శిల్పాల పార్కు వంటివెన్నో చూడొచ్చు.

వాచీల పట్టణం

స్విట్జర్లాండులోని గడియారాలను ఉత్పత్తి చేసే రెండు నగరాలను సందర్శించడమంటే మెదడుకు పదును పెట్టడమే. అగ్నిప్రమాదం తర్వాత 19వ శతాబ్ద ప్రారంభంలో వీటిని పునర్నిర్మించారు. దూరం నుంచి చూడ్డానికి అగ్గిపెట్టెలను పొందికగా సర్దినట్టు కనిపిస్తాయి. 17వ శతాబ్దం నుంచి వున్న వాచీల తయారీ ఇప్పటికీ అక్కడ కనిపించడం కొంచెం ఆశ్చర్యంగానే వుంటుంది.

కారల్ సూప్

కొత్త పుస్తకాలు

ఆలోచింపచేసే నానీలు

కొందరు విమర్శకులు పెదవి విరిచినా ఓ విశిష్టమైన స్థానం సంపాదించిన ఈ నానీ ప్రక్రియలో ప్రఖ్యాత కవి - విమర్శకులు, పరిశోధకులు ద్వానాశాస్త్రి సంపాదకత్వంలో ఈ "శతాధిక కవుల నానీలు" సంపుటి వెలువడింది. 165 పేజీల్లో 105 మంది కవులు రాసిన నానీలను ఎంపిక చేసి డా॥ద్వానా ఈ సంకలనం తెచ్చారు. డా॥ ఎన్ గోపి, ఎస్.ఆర్. భల్లం, అంబల్ల జానార్ధన్, ద్వానాశాస్త్రి, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎన్. రఘు, పత్తిపాక మోహన్, తలతోట పృథ్వీరాజ్, శారదా అశోక్ వర్ధన్, చిల్లర భవానీదేవి, దుగ్గిరాల సోమేశ్వరరావు, కొట్టి రామారావు, నలిమెల భాస్కర్, కోనూరి గాంధీ, సంగిలేని రవీంద్ర, కన్నోజు లక్ష్మీకాంతం, అనిశెట్టి రజిత, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, నాంపల్లి సుజాత, ఇతా చంద్రయ్య, బొబ్బిలి జోసెఫ్, వాసాల నర్సయ్య, కె. ఎన్. అనంతాచార్య, మాజిశెట్టి గోపాల్, రసరాజు, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వల్లభాపురం జనార్ధన, ఝాన్సీ కె.వి కుమారి, డా॥ పి శేషాద్రి మహ్మద్ ఖాన్, ఎం.ఎ.గఫార్, పెరుగు రామకృష్ణ డా॥ మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, టి. సంపత్‌కుమార్ లాంటి ప్రఖ్యాత కవుల ముఖ్యమైన 'నానీ' లు ఈ సంపుటిలో ఉన్నాయి.



శతాధిక కవుల నానీలు
సంపాదకుడు : డా॥ ద్వానాశాస్త్రి.
పేజీలు :116.
వెల 70 రూ॥
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్

ఏ కవితా రూపమైనా కవి శక్తిని బట్టి రాణిస్తుంది. శక్తిమంతులైన కవులు ఇప్పుడు నానీలవైపు తమ అక్షరయానం సాగిస్తున్నారు. తంజావూరు రఘునాథరాజు కవిత్వాన్ని నిర్వచిస్తూ ఒకచోట ఇలా అంటారు. "కవిత్వం విప్పిన విరి పొట్లాం లాగ గుప్పుమనాలి". అలా శతాధిక కవులు రాసిన ఈ 'నానీ'ల సంపుటిలో కొన్నింటిని పరిశీలించిన దేశభక్తి, సామాజికాంశాలు, అస్తిత్వవేదన, ప్రపంచీకరణపై వ్యతిరేకత, కుటుంబ ప్రేమ, సాటివారిపై దయ, సానుభూతి లాంటి ఎన్నో అంశాలు కనిపిస్తాయి..

నానీల సృష్టికర్త డా॥ గోపి(పేజీ.19) "కుండ ముక్కలైందా/ కుమిలిపోకు/ మట్టి మరో రూపం కోసం/ సిద్ధమౌతుంది" అంటారు.

ఎస్. ఆర్. భల్లం (పేజీ.21) తమ నానీలో ఇలా అంటారు. "మమకారపు/ మహా కావ్యానికి/ ముందుమాట/ ఎప్పుడూ అమ్మే!".

అంబల్ల జనార్ధన్(పేజీ.24) "ముంబయి కావ్యంలో/ మోసం ఉంది/ హాసమూ వుంది/ ముగింపేమిటో?".

సంకలనకర్త, సంపాదకులు డా॥ ద్వానాశాస్త్రి (పేజీ 25-26) "ఏడు పదులలోనూ/ యజ్ఞం చేశాడు/ కథానిలయం/ తెలుగోడి డాక్యుమెంట్".

తొలి నాళ్ళలోనే 'నానీ'ల్ని స్వీకరించిన సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఒక చోట నానీల్లో ఇలా అంటారు. (పేజీ.28) "కాశ్మీర్ ఆపిల్/ కొరికి చూద్దును గదా/ గడ్డకట్టిన/ నెత్తురు" .

"వివాహమా! ఎంత పనిచేశావు?/ నన్ను పుట్టింటికి/ అతిథిని చేశావు" అంటారు చిల్లర భవానీదేవి.

"డాలర్ క్షేత్రాలకు మేధోవలస/ ఆవలి తీరాన/ సరస్వతీ పుత్రులు" అంటారు అనిశెట్టి రజిత (పేజీ.93).

"రాయలసీమ అనగానేమి? నీళ్ళకు బదులుగా/ కన్నీళ్ళు కురియును" (పేజీ.98) అంటారు రాచపాళెం చంద్రశేఖరెడ్డిగారు.

"ఏ దేశంతోనూ/ దానికి అమరిక లేదు/ అందుకే దాని పేరు అమెరికా" (పేజీ.113) అంటారు డా॥ మచ్చ హరిదాసు. "వివేకానికి కవిత్వం తోడు కావాలంటాడు" టి.ఎస్.ఇలియట్.

చైతన్యవంతమైన, వివేకవంతమైన, ప్రయోగాత్మకమైన, ప్రయోజనాత్మకమైన 'నానీ'లెన్నో ఈ చిరుసంపుటిలో మనల్ని ఆలోచింపచేస్తాయి.

- తంగిరాల చక్రవర్తి



వీరనారి ఝాన్సీ ఝల్‌కారీబాయి
హిందీమూలం : మోహన్‌దాస్ నైమిశ్‌రాయ్
అనువాదం : డా॥జి.వి.రత్నాకర్
వెల : 40/-, పేజీలు :48.
ప్రతులకు : డి. కృష్ణవేణి
బి 15/1, ఇ.ఎస్.ఐ క్వార్టర్స్,
యస్.ఆర్.నగర్- 38,
హైదరాబాద్. అన్ని పుస్తక కేంద్రాలు.

వర విక్రయము (నాటకం)
కాళ్లకూరి నారాయణరావు
వెల : 25/-, పేజీలు :80.
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీల్లో.



భూమికి హామీ

జీవులకు ఆవాసం ఇచ్చే భూమిలాంటి గోళాలు ఈ విశ్వంలో చాలా ఉండి ఉండవచ్చు. కాని ఇప్పటివరకు - అంటే ఇప్పటి మన విజ్ఞానానికి అందినంతవరకు - భూమ్మీద మాత్రమే జీవులున్నాయి. భూమ్మీద జీవులకు ప్రాణాధారం వాతావరణం. ఏ గ్రహంమీదా లేని ప్రత్యేక వాతావరణం భూమ్మీద ఉంది. విశ్వదృష్టితో చూస్తే భూమ్మీద వాయువులతో కప్పబడి ఉన్న పలుచటి దుప్పటే ఈ వాతావరణం. అంతా కలిపితే 200 కిలోమీటర్ల ఎత్తుండే ఈ వాతావరణం పొరలో చాలా కొద్ది ఎత్తువరకు మాత్రమే మానవుడు నివసించగలుగుతాడు. ఈ వాతావరణ పొర మానవులు బ్రతకడానికి అవసరమైన ప్రాణవాయువును అందిస్తుంది. పీడనాన్ని కల్పిస్తుంది. సూర్యుని కాంతిని స్వీకరించి, భూమ్మీద నీటినీ, రసాయనాలనూ రీసైకిల్ చేసి జీవులు నివసించడానికి కావలసిన పర్యావరణాన్ని సృష్టిస్తుంది. సూర్యుడినుండి వచ్చే అతినీలలోహిత (అల్ట్రావయొలెట్) కిరణాల నుండి జీవులను రక్షిస్తుంది. మహావిశ్వంలోని లక్షలాది డిగ్రీల ఉష్ణోగ్రతలతో పోలిస్తే భూమ్మీద ఉష్ణోగ్రతలు చాలా పరిమితమైన స్థాయిలో ఉండడానికి కారణం ఈ వాతావరణం పొరే. ఉదాహరణకు: భూమ్మీద ఇప్పటివరకు అత్యధికంగా రికార్డయిన ఉష్ణోగ్రత 57.8 డిగ్రీల సెల్సియస్. అత్యల్పం -89 (మైనస్ 89) డిగ్రీల సెల్సియస్. అంటే భూమ్మీద మొత్తం ఉష్ణోగ్రత రేంజి సుమారు 140 డిగ్రీల సెల్సియస్ అన్నమాట. ఈ విశ్వంలోని మహా మహా ఉష్ణోగ్రతలూ, మహా మహా చలి ప్రదేశాలూ, అతి తీక్షణమైన వాతావరణ పరిస్థితులతో పోలిస్తే భూమ్మీద వాతావరణం ఎంత సున్నితంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సున్నితమైన వాతావరణానికి ఇప్పుడు మానవుని విచక్షణారహిత కార్యకలాపాలవల్ల పెద్ద ముప్పు వచ్చి కూర్చుంది. మరి పొంచివున్న ఆ ప్రమాదం ఏంటో...దాన్నుంచి భూమిని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఏంటో ఈ వారం అట్టమీది కథలో చూద్దాం.

- ఎస్. వెంకట్రావు

గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ వల్ల భూతాపం పెరుగుతోంది (గ్లోబల్ వార్మింగ్). భూవాతావరణానికి పొంచివున్న ముప్పు అదే. పారిశ్రామిక దేశాలూ, వాటి బహుళజాతి సంస్థలూ భూమి పొరల్లోని శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజవాయువులను రానురాను మరింత సామర్థ్యంతో, మరింత వేగంగా తోడేసి ఫ్యాక్టరీల్లోనూ, వాహనాల్లోనూ మండించేస్తున్నాయి. అడవులను నరికేస్తూ జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నాయి. నేలను తల్లకిందులు చేసి ఖనిజాలను విచక్షణా రహితంగా తోడేస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలు, రవాణా కోసం శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా మండించడం వల్ల వాతావరణంలో కార్బన్-డైఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సయిడ్ వంటి వాయువుల సాంద్రత పెరిగిపోతోంది. ఈ వాయువులు భూమి పైన ఒక పొరలాగా ఏర్పడి సూర్యుని నుండి వచ్చే వేడిమిని నిలిపి ఉంచి భూగోళాన్ని క్రమంగా వేడెక్కిస్తున్నాయి. దీన్నే 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్' అంటున్నారు. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరిగే కొద్దీ సూర్యుని వేడిని అవి మరింతగా పట్టి ఉంచుతాయి. దానివల్ల భూగోళం మరింత వేడెక్కుతుంది.

భూతాపం పెరిగితే ప్రమాదమే

గ్రీన్‌హస్ ఎఫెక్ట్ వల్ల గత 100 సంవత్సరాల కాలంలో భూమి మీద సగటు ఉష్ణోగ్రత అర డిగ్రీ నుండి ఒక డిగ్రీ సెల్సియస్ మధ్య పెరిగిందని శాస్త్రవేత్తలు లెక్కలు కట్టి మరీ చెబుతున్నారు. 'సగటు ఉష్ణోగ్రత ఒక్క డిగ్రీ పెరిగితే ఏమవుతుంది?' అనుకోకండి. దీనివల్ల చాలా సున్నితమైన భూ వాతావరణంలో పెద్ద మార్పులు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీనివల్ల భూగోళం ధృవాల వద్ద, ఐస్‌లాండ్ వంటి ప్రాంతాల్లో మంచు కరిగిపోయి జలరాసిగా మారిపోతుంది. దాంతో

సముద్రాల నీటిమట్టం పెరుగుతుంది. సముద్ర మట్టం ఒకటి రెండు మీటర్లు పెరిగితే చాలా తీర ప్రాంతాలు నీటిలో మునిగిపోతాయి. మానవావాసాలుగా ఉన్న అనేక దీవులు మునిగిపోతాయి. కొన్ని జలమయమవుతాయి. తీరప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాలు, నగరాలు దెబ్బతింటాయి. ఇదే కాకుండా రుతుపవనాల్లో తేడాలు వస్తాయి. ఒక ప్రాంతంలో అధిక వర్షాలు కురిసి ఉధృతమైన వరదలు సంభవిస్తే మరికొన్ని ప్రాంతాలు అస్సలు వర్షాలు లేక కరువుకాటకాలతో అలమటిస్తాయి. జలవనరులు నాశనమై మంచినీటికి కటకట ఏర్పడుతుంది. పంటల సీజన్లలో మార్పులొస్తాయి. భూమి వేడి పెరుగుతున్న కొద్దీ వరదలూ, తుపానులు, దుర్భిక్షాల తీవ్రతా, సంభావ్యతా బాగా పెరుగుతాయి. వీటి పర్యవసానాలు ప్రజలమీద చాలా తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా వాతావరణ మార్పుల వల్ల సంభవించే ఉత్పాతాలు ఈ మార్పులకు కారణమైన సామ్రాజ్యవాద దేశాలకన్నా పేద దేశాలమీద ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. అలాగే ఆయా దేశాల్లో ధనికులకన్నా పేదలే ముందుగా, తీవ్రంగా నష్టపోతారు.

అమెరికా తరహా అభివృద్ధి తెచ్చిన తంటా

శిలాజ ఇంధనాలనుండి వెలువడుతున్న కర్బన వాయువుల వల్ల భూగోళం వేడెక్కి వాతావరణంలో అనేక వినాశకర మార్పులు సంభవిస్తున్నాయని ఇటీవల జరుగుతున్న శాస్త్ర పరిశోధనలన్నీ ముక్త కంఠంతో చెబుతున్నాయి. కాని ప్రతి రోజూ మన రోడ్ల మీదికి వేలాదిగా కొత్త వాహనాలు వచ్చి చేరిపోతూనే ఉన్నాయి. రోడ్లు విస్తరిస్తున్నంతలోనే ఆ రోడ్లు పట్టనంతగా వాహనాలు పెరిగిపోతున్నాయి. వందలు, వేల హెక్టార్లల్లో అడవులు నాశనమైపోతున్నాయి. లక్షలాది ఎకరాల పంట భూములు రియల్ ఎస్టేట్లుగా మారిపోతున్నాయి. అభివృద్ధి అంటే స్వంతవాహనం, అభివృద్ధి అంటే విపరీతమైన వస్తువినియోగం, అభివృద్ధి అంటే అడవులను నరికివేయడం, అభివృద్ధి అంటే విశాలమైన పంటపొలాలను విలాసవంతమైన నివాసప్రాంతాలుగా మార్చడం అనే అమెరికా తరహా అభివృద్ధి నమూనా నుండే ఈ సమస్యంతా వచ్చిపడుతోంది.

కాలుష్య భూతాలు

2002 నాటికి ప్రపంచంలో 59 కోట్ల కార్లు వాడకంలో ఉన్నాయి. వాటిలో 14 కోట్ల కార్లు -అంటే మొత్తం కార్లలో 20 శాతం- అమెరికాలోనే ఉన్నాయి. 2005లో ప్రపంచంలో మొత్తం 6.9 కోట్ల కార్లు ఉత్పత్తి అయినాయి. వీటిలో జపాన్, జర్మనీ, అమెరికాలు సింహభాగం ఉత్పత్తి చేశాయి. 2005లో అమెరికా 1.15 కోట్ల కార్లు, తేలికపాటి వాణిజ్య వాహనాలూ ఉత్పత్తి చేసింది. జపాన్ 1.06 లక్షలు, జర్మనీ, చైనాలు సుమారు 50 లక్షలు ఉత్పత్తి చేశాయి.

గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ అంటే...

చలి ప్రదేశాల్లో కూరగాయలు పండించడానికి అద్దాలతో మూసేసిన షెడ్లు నిర్మిస్తారు. అద్దాలగుండా లోనికి ప్రవేశించిన సూర్యరశ్మిలో కొంతభాగం పరావర్తనం చెంది బయటకు పోతుంది. కానీ కొంతభాగం లోపలే ఉండిపోయి లోపల వెచ్చదనం వ్యాపిస్తుంది. ఈ అద్దాల నిర్మాణాన్ని గ్రీన్‌హౌస్ అంటారు. ఈ విశ్వంలో భూమిలాంటి గ్రహాలు చాలా ఉన్నా వాటి మీద జీవరాసి లేదు. భూమి మీద జీవరాసి మనుగడ సాగించడానికి దాని మీద ఏర్పడిన వాతావరణం కారణం. అంతరిక్షంలోనుండి చూస్తే భూగోళం వాయువులతో కూడిన ఒక పలుచటి దుప్పటి కప్పుకున్నట్లుంది. ఈ వాయు పొరే గ్రీన్‌హౌస్‌లో అద్దంలాగా పనిచేస్తుంది. భూమి మీద ఇంధనాలన్నిటికీ మూలం సూర్యుని నుండి వచ్చే శక్తి కిరణాలే. 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుని నుండి వచ్చే శక్తి కిరణాల్లో చాలాచాలా కొద్ది భాగం భూమిని చేరుతుంది. ఇందులో మూడో వంతు శక్తి భూమ్మీదగల నీళ్లు, మంచు, ఇతర మెరిసే ఉపరితలాలమీద పడి వెనక్కు పరావర్తనం చెందుతుంది. మిగిలిన ఒక వంతు మాత్రమే భూమిని తాకి నేలను, నీటిని వేడి చేస్తుంది. అయితే ఇందులో చాలా భాగం మళ్లీ అంతరిక్షంలోకి వెదజల్లబడుతుంది. అలా వెనక్కు ప్రయాణం చేసేటప్పుడు మన భూమిని కప్పిఉన్న వాయుకణాలు ఈ శక్తి కిరణాలను అడ్డుకుని అన్ని వైపులా వెదజల్లుతాయి. గ్రీన్‌హౌస్‌లో అద్దాల మాదిరిగా ఇక్కడ వాయువు పొర పనిచేస్తుంది. దీన్నే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ అంటారు. దానివల్ల భూమి మీద వెచ్చదనం వ్యాపిస్తుంది. వాతావరణం వేడికి కారణమైన వాయువులను గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. నిజానికి ఈ గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ లేకుంటే మన భూమి అతి శీతలమైన మంచు ముద్దలా మారేది. దాని సగటు ఉష్ణోగ్రత -18 డిగ్రీల సెల్సియస్‌వద్ద ఉండేది. కానీ ఇప్పుడు భూమి సగటు ఉష్ణోగ్రత 14 డిగ్రీలుంది. దానివల్ల మనం సుఖంగా ఉండగలుగుతున్నాం. అంటే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ జీవజాలం ఉనికి చలా అవసరమన్న మాట. కానీ శృతి మించితే ఇదే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ మానవాళిని అంతం చేస్తుంది కూడా. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత ఎక్కువయితే అది భూమ్మీద మరింత ఉష్ణాన్ని నిలుపుతుంది. అప్పుడు భూమి సగటు ఉష్ణోగ్రత 14 కన్నా ఎక్కువ డిగ్రీలకు పెరుగుతుంది. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ యొక్క సహజమైన ప్రక్రియలో మానవుని కార్యకలాపాలు జోక్యం చేసుకుని ప్రమాదం తెచ్చిపెట్టాయి. 400 సంవత్సరాల క్రితం పారిశ్రామిక విప్లవం ప్రారంభమైనాక విచ్చలవిడిగా శిలాజ ఇంధనాలు మండించడం వల్ల వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల [illegible] ఎక్కువై నేడు ప్రమాదకర స్థితికి చేరుకున్నది.

ఇదే ఏడాది భారత్‌లో 14.06 లక్షల కార్లు ఉత్పత్తి అయినాయి. మన దేశంలో కార్ల ఉత్పత్తి తక్కువగా ఉండవచ్చు కాని దిగుమతి అవుతున్న కార్లు రోడ్లమీదకు ఎక్కుతున్నవి ఎక్కువగానే ఉన్నాయి.

వ్యక్తిగత కార్ల స్థానంలో ప్రజా రవాణా వ్యవస్థను బాగా అభివృద్ధి చేస్తే వాతావరణ కాలుష్యాన్నీ తగ్గించవచ్చు, ప్రజల ఆరోగ్యాన్నీ కాపాడవచ్చు. రోడ్ల మీద ఒత్తిడిని బాగా తగ్గించవచ్చు. కాని ప్రభుత్వాలు ఈ పనిచేయడానికి సిద్ధపడ్డం లేదు. పైగా కొత్తగా పెద్ద ఎత్తున కార్ల ఉత్పత్తికే ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రభుత్వాల విధానాలు ప్రజా రవాణా వ్యవస్థ పెరుగుదలవైపు కాకుండా వ్యక్తిగత వాహనాలను ప్రోత్సహించేవైపు సాగుతున్నాయి. ఇప్పటిమాదిరిగానే వాహనాల వాడకం పెరిగితే 2009 నాటికి ఒక్క అమెరికాలోనే 5 లక్షల టన్నుల గ్రీన్ హౌస్ వాయువులు వ్యక్తిగత వాహనాల ద్వారా గాలిలోకి విడుదలవుతాయని నిపుణులు అంచనా వేశారు. మన హైదరాబాదు జంట నగరాల్లో 12 లక్షల కార్లు, తేలిక వాహనాలూ రోడ్లమీద తిరుగుతున్నాయి. ఇవి రోజుకు సుమారు 1000 టన్నుల గ్రీన్ హౌస్ వాయువులను గాలిలోకి విడుదల చేస్తున్నాయి. వాహనాలతోబాటు పెరుగుతున్న పరిశ్రమల ద్వారా కూడా కర్బన వాయువులూ, ధూళికణాలూ పెద్ద ఎత్తున గాలిలోకి విడుదలవుతున్నాయి.



మంచు కరిగిపోతోంది....

విజ్ఞత - వినియోగం

అభివృద్ధి వద్దని కాదు. వస్తు వినియోగమూ అవసరమే. కాని వాణిజ్య పోటీ పేరుతో అనవసరమైన వస్తువినియోగాన్ని పెంచి విలువైన ప్రకృతి వనరులను విపరీతంగా ఖర్చుచేయడమే కాకుండా మానవాళికి ఊతమిస్తున్న భూగోళానికే ఎసరు తేవడం ఎంతవరకు విజ్ఞత అనిపించుకుంటుంది? ఆధునికతలో మునిగి తేలుతున్న మనం ఈమాత్రం ఆలోచనతో ఎందుకు వ్యవహరించలేకపోతున్నాం? కార్లు మాత్రమే కాదు అమెరికా తరహా విచ్చలవిడి వినియోగ సంస్కృతి అనేక విధాలా వాతావరణాన్ని నాశనం చేస్తోంది. పారిశ్రామిక అవసరాలు, రవాణా అవసరాలకు శిలాజ ఇంధనాల వినియోగం విపరీతంగా పెరిగి పోతున్నందున భూ తాపం రానురాను మరింత తీవ్రంగా పెరుగుతోంది.

కోపెన్‌హాగన్ సదస్సు

ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచం భూతాప ఉపద్రవం నుండి తప్పుకోవాలంటే ఏం చేయాలి? అన్న అంశంపై డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ నగరంలో జరిగిన వాతావరణ శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ దేశాలు మల్లగుల్లాలు పడ్డాయి. భూతాపం 2 డిగ్రీల సెంటీగ్రేడుకన్నా ఎక్కువ పెరగకుండా ఉండాలంటే అభివృద్ధి చెందిన దేశాలు 2020 నాటికి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను 40 శాతానికీ, 2050 నాటికి 90 శాతానికీ తగ్గించుకోవాలని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లయిమేట్ చేంజ్-ఐపిసిసి నివేదిక నిర్దేశించింది. గతేడాది ఇండొనేషియాలోని బాలిలో జరిగిన వాతావరణ సదస్సులో ఏఏ దేశాలు ఎంతెంత శాతం విడుదలలు తగ్గించుకోవాలో నిర్ణయించారు. 1990 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఈ తగ్గింపు జరగాలి. కోపెన్‌హాగన్ సదస్సులో ఈ మేరకు చట్టబద్ధమైన కట్టుబాటు ఉండే (లీగల్లీ బౌండ్) ఒప్పందం కుదుర్చుకోవాలని అనుకున్నారు. కాని ఇటువంటి ఒప్పందం చేసుకోడానికి పారిశ్రామిక దేశాలు సిద్ధంగా లేవు. తాము 20 శాతం తగ్గించుకుంటామని ఐరోపా యూనియన్ ప్రకటించగా, అమెరికా మరీ మొండికేసి 3 శాతం మాత్రమే తగ్గించుకుంటామని చెబుతోంది. పైగా చట్టబద్ధమైన కట్టుబాటుకు అమెరికా గాని చాలా ఐరోపా దేశాలుగాని ముందుకు రావడం లేదు. అందువల్ల కోపెన్‌హాగన్ సదస్సులో నేతలందరూ సమావేశమై ఉత్తిత్తి మాటలతో ఒక రాజకీయ ప్రకటన చేసి సదస్సును ముగించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. నిజానికి చట్టబద్ధమైన కట్టుబాటు లేకపోతే క్యోటో ఒప్పందానికి పట్టిన గతే కోపెన్‌హాగన్ ఒప్పందానికీ పడుతుంది (వ్యాసం

గ్రీన్‌హౌస్ వాయువులు

కార్బన్-డై-ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్, ఏరోసోల్ (నీటి ఆవిరి, ధూళి కణాలూ) మొదలైన వాటిని గ్రీన్‌హౌస్ వాయువులు అంటారు. వీటిలో కార్బన్ డై-ఆక్సైడ్ 70 శాతం వేడిమికి కారణం. ఇది ప్రధానంగా శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్ల వాతావరణంలో వ్యాపిస్తుంది. కార్బన్-డై-ఆక్సైడ్‌ను మొక్కలు పీల్చుకుంటాయి. కనుక అడవులు ఎక్కువగా పెంచితే కొంతమేరకు కార్బన్-డై-ఆక్సైడ్ తగ్గొచ్చు. కాని అడవులు నరికేయడం జరుగుతోంది. పారిశ్రామిక విప్లవం వచ్చాక మొక్కలు పీల్చుకునే కార్బన్-డై-ఆక్సైడ్‌కన్నా వాతావరణంలోకి పరిశ్రమలు, వాహనాల ద్వారా వచ్చే వాయువే ఎక్కువగా ఉంది. ఇక రెండోది నైట్రస్ ఆక్సైడ్. ఇది 7 శాతం వేడికి కారణం. వాతావరణంలో అధిక శాతం నత్రజని వాయువు ఉంది. కొన్ని రకాల బాక్టీరియా నత్రజనిని నైట్రస్ ఆక్సైడ్‌గా మారుస్తాయి. ఈ రూపంలో నత్రజనిని మొక్కలు ఉపయోగించుకుని ఆహారంగా మార్చుకుంటాయి. కాబట్టి మొక్కల ఎదుగుదలకు ఇది అవసరం. నత్రజని ఎరువులు తయారుచేసేటప్పుడు ఈ వాయువు వాతావరణంలోకి చాలా పెద్ద మొత్తంలో విడుదలవుతోంది. మూడోది మీథేన్. ఇది 23 శాతం కాలుష్యానికి కారణం. ఇది భూమ్మీద చాలా వనరులనుండి లభ్యమవుతుంది. ముఖ్యంగా ప్రపంచంలోని కోట్లాది పశువుల పేడ, కుళ్లిన ఆకులు అలములు, చెత్త నుండి ఇది ఉత్పత్తి అవుతుంది.



రాసే సమయానికి అందుబాటులో వున్న సమాచారం మేరకు).

అమెరికా అడ్డంకులు

భారత్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలకు చట్టబద్ధంగా కట్టుబడేట్లు ఒప్పందం ఉండాలని అమెరికా పట్టుబడుతోంది. ముఖ్యంగా చైనా, భారత్‌లు వాయువుల విడుదలను తమతో సమానంగా తగ్గించుకోవాలని మెలిక పెడుతోంది. కోపెన్‌హాగన్ ఒప్పందంగాని, అంతకు ముందు క్యోటో ఒప్పందం గాని వర్ధమాన దేశాలు గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను ఖచ్చితంగా, చట్టబద్ధంగా తగ్గించుకోవాలని షరతులు పెట్టలేదు. ఎందుకంటే పారిశ్రామిక దేశాలతో పోలిస్తే వర్ధమాన దేశాలు విడుదల చేసే కలుషిత వాయువులు తక్కువ. వాతావరణంలోకి విడుదలవుతున్న మొత్తం గ్రీన్‌హౌస్ వాయువుల్లో ధనిక దేశాలే 80 శాతం విడుదల చేస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 5 శాతం ఉన్న అమెరికా ప్రపంచ ఇంధనవనరుల్లో 25 శాతం ఉపయోగించుకుంటోంది. వాతావరణంలోకి 20 శాతం గ్రీన్‌హౌస్ వాయువులను అదొక్కటే విడుదల చేస్తోంది. వీటితో పోల్చినప్పుడు భారత్, చైనాతో సహా మొత్తం వర్ధమాన దేశాలన్నీ విడుదల చేస్తున్న వాయువులు 20 శాతం మాత్రమే. వర్ధమాన దేశాలు ఇప్పుడున్న కనీస అభివృద్ధిని సాధించాలంటే ఆ మాత్రం ఇంధనం ఖర్చుచేయడం, ఆ మాత్రం వాయువులు విడుదల చేయడం వాటికి అనివార్యం. అయితే శీఘ్రాభివృద్ధి సాధిస్తున్న చైనా, భారత్‌లు కూడా తమతోబాటు తప్పనిసరి కోటాలు తీసుకోవాలని, మిగిలిన వర్ధమాన దేశాలు కూడా వాయువుల విడుదల తగ్గించుకోవాలని అమెరికా, ఇతర ధనిక దేశాలూ పట్టుబడుతున్నాయి.



గత 400 సంవత్సరాలుగా అంటే పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటినుండీ సామ్రాజ్యవాద దేశాలు దేశదేశాల ఇంధనాలను భారీ స్థాయిలో మండిస్తూ వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల చేస్తూ వచ్చాయి. అంటే వాతావరణంలో కార్బన్-డై ఆక్సైడ్ తదితర వాయువులు ఈ సాంద్రతలోకి వచ్చాయంటే అమెరికా ఇతర సామ్రాజ్యవాద దేశాలు ఇన్ని శతాబ్దాలుగా విడుదల చేసిన వాయువులే కారణం. కానీ వాతావరణం అందరిదీ, అన్ని దేశాలదీ. అన్ని దేశాల వాతావరణాన్ని అమెరికా, ఐరోపా వలసవాద దేశాలు చారిత్రకంగా ఆక్రమించుకున్నాయి. తీరా ఇప్పుడు ఆలస్యంగా రంగంలోకి వచ్చిన వర్ధమాన దేశాలకు చోటులేదు పొమ్మంటున్నాయి. అంటే ధనికదేశాలు తమ పారిశ్రామిక ప్రగతిని అట్టే పెట్టుకుంటాయి, కాని వర్ధమాన దేశాలు మాత్రం ముందుకు రావడానికి వీల్లేదన్నమాట. ఇక వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించాలంటే చమురు, బొగ్గు, గ్యాస్ తదితర ఇంధనాలకు బదులు సౌరశక్తి, పవన శక్తి, అణు ఇంధనం వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాలి. దానికి విపరీతమైన ఆర్థిక వనరులూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమూ కావాలి. ఈ రెండూ బహుళజాతి సంస్థల గుప్పెట్లో ఉన్నాయి. కాబట్టి ప్రత్యామ్నాయ ఇంధనాలవైపు మళ్లడానికి వనరులూ, అవకాశాలూ ఎక్కువగా సామ్రాజ్యవాద దేశాలకే ఉన్నాయి. వర్ధమాన దేశాల వద్ద వనరులు లేవు. సాంకేతిక పరిజ్ఞానం కూడా లేదు. కాబట్టి అవి ప్రత్యామ్నాయ ఇంధనాలవైపు మళ్లలేవు. అందువల్ల పారిశ్రామిక ప్రగతిని తగ్గించుకోకుండా ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించుకోగల సామర్థ్యం, స్థోమతా పారిశ్రామిక దేశాలకు మాత్రమే ఉంది. వర్ధమాన దేశాలు కూడా ఈ పని చేయాలంటే వాటికి పారిశ్రామిక దేశాలు, అంతర్జాతీయ సంస్థలద్వారా నిధులూ, సాంకేతిక పరిజ్ఞానమూ బదిలీ చేయాలి. కాని ఒక్క పారిశ్రామిక దేశం కూడా ఈ పనిచేయడానికి ముందుకు రావడం లేదు. ప్రత్యామ్నాయ ఇంధనాలు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంపై బహుళజాతి కంపెనీలు పేటెంట్లు పొంది తమ గుప్పెట్లో పెట్టుకున్నాయి. అందువల్ల వర్ధమాన దేశాలకు పారిశ్రామిక దేశాలు నిధులూ, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయాలనీ, వాటి సాయంతో తాము స్వచ్ఛందంగా గ్రీన్‌హౌస్ వాయువులను ఏమేరకు తగ్గించుకోగలిగితే ఆ మేరకు తగ్గించుకోవాలనీ వర్ధమాన దేశాలు న్యాయంగానే కోరుతున్నాయి. కాని అమెరికా దీన్ని వ్యతిరేకిస్తోంది. వర్ధమాన దేశాల అశక్తతను అడ్డం పెట్టుకుని తాను కూడా ఒప్పందం నుండి దూరం పోవడానికి ప్రయత్నిస్తోంది. ★



కాలుష్యానికి విరుగుడు మొక్కలు పెంచడమే



ఎన్ని గుడ్లో!



హాయ్ నేస్తాలూ! ఫొటోలు చూశారుగా... ఒక్క చేత్తో ఎన్ని గుడ్లు పట్టుకున్నాడో! అతగాడి పేరూ ఊరూ తెలీదుగానీ ఫొటోలు మాత్రం నెట్‌లో కనిపించాయర్రా.

వాటిని చూస్తే మీరు కూడా స్ఫూర్తి పొందుతారని మీ ముందుకు తెచ్చేశాం. సరేగానీ అసలు విషయం చూద్దాం. మనం రెండు గుడ్లు పట్టుకోడానికే నానా తిప్పలు పడుతుంటాం కదా. అలాంటిది ఒక్కసారిగా ...అన్ని గుడ్లు పట్టుకోవడమంటే మాటలా! కానీ నేస్తాలూ...సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని పెద్దలు ఎప్పుడో చెప్పారుగా. ఇతగాడు కూడా అంతే. మనమైనా అంతే.

సంతకం

మదర్ థెరిస్సా



దారి చెప్తామా

బయటికి

ట్రెజర్ బాక్స్

చేసేద్దాం

పిల్లలూ మనం ఆడుకున్న తర్వాత, లేదంటే చదువుకున్న తర్వాత బొమ్మలు, రబ్బర్లు, కలర్ పెన్సిళ్లు ఎక్కడ పడితే అక్కడ వేస్తుంటాం. అమ్మావాళ్లేమో వాటిని సర్దుతూ ఉంటారు. కానీ వాళ్లు మాత్రం ఎన్నని చేస్తారు? ఇంటి పనులతో అలిసిపోయి ఉంటారు కదా! పైగా మన వస్తువులను కూడా వాళ్లే సర్దాలా? వారికి ఇబ్బంది కలుగకుండా వాటిని మనమే ఒక దగ్గర దాచుకుంటే కొంత సహాయం చేసినట్టు ఉంటుంది కదా! అందుకే ఇవాళ ట్రెజర్ బాక్స్‌ను తయారుచేయడం నేర్చుకుందాం. ఎంచక్కా దానిలో మన వస్తువులను వేసుకోవచ్చు. మనకు కావాల్సినప్పుడు తీసుకోవచ్చు. అమ్మావాళ్లను విసిగించాల్సిన పనుండదు.

కావాల్సిన వస్తువులు:

గట్టిఅట్ట డబ్బా(బూట్ల బాక్స్), మీకు నచ్చిన రంగు కాగితం, పాత వార పత్రికలు/ మాస పత్రికలు. వార్తాపత్రికలు, పాత ఫొటోలు, కత్తెర, గమ్.

తయారు చేసేవిధానం:

ముందుగా బూట్ల డబ్బా తీసుకోవాలి. దానిమీద మనకు నచ్చిన రంగు కాగితం అతికించాలి. ఇప్పుడేం చేయాలంటే... మీకు నచ్చిన పాత ఫోటోలు, పత్రికలలోని బొమ్మలు, మీకు నచ్చిన వాక్యాలు కత్తిరించుకోవాలి. వాటిని డబ్బాపైన, మూతపైన గమ్‌తో అంటించుకోవాలి. అలా అంటించేప్పుడు మూత మూసుకుపోకుండా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే డబ్బా తెరవడానికుండదు. దాన్ని పూర్తిగా ఎండనివ్వాలి. అంతే ట్రెజర్ బాక్స్ రెడీ. తర్వాత ఇంకేముంది! మనం రోజూ ఎక్కువగా ఉపయోగించే చిన్న చిన్న వస్తువులను అందులో వేసుకుని భద్రపరచుకోవచ్చు. కావాల్సినప్పుడు గబుక్కున తీసుకోవచ్చు. ఐడియా బావుందికదూ. మరింకెందుకు ఆలస్యం! బూట్ల డబ్బా సేకరించండీ!!

నేనెవరిని?

నేస్తాలూ... ఏజంతువు చెట్టంత ఎత్తు ఎగురుతుంది?

జవాబు: ఏ జంతువైనా ఎగరగలదు. చెట్టు మాత్రం ఎగరదు. అలాగే వుంటుంది.

O	H	E	H	S	S	F	A	I	R	Y	D	U	S	T
S	N	P	F	F	M	F	F	L	G	O	M	X	D	G
H	E	C	A	L	A	P	B	R	I	C	W	F	I	W
L	C	E	J	D	E	P	A	B	S	F	I	I	D	C
V	L	D	K	Z	R	N	D	E	W	B	Q	N	Q	E
V	L	D	T	O	D	M	K	U	W	V	A	Z	I	L
E	E	S	K	M	Y	F	O	U	G	L	I	B	Q	E
B	I	J	A	D	R	O	Q	O	M	F	G	I	J	S
K	D	V	S	F	I	V	Y	A	N	D	T	J	J	T
R	J	Y	E	F	A	O	E	O	B	B	B	T	C	E
A	L	B	N	Y	F	R	X	F	U	A	E	Z	C	Y
T	F	U	U	Z	D	E	W	U	H	R	O	A	Q	H
S	B	F	M	T	D	A	X	U	C	C	F	U	M	U
J	Q	Y	F	J	C	Q	K	Q	B	J	G	Y	T	T
Z	H	K	C	M	L	Z	M	G	R	B	F	G	P	B

ఏంటో అవి?

నేస్తాలూ...పైనున్న బాక్సులోని అక్షరమాలలో కొన్ని పదాలు దాగున్నాయి. అవేంటో మీకు చిన్న క్లూ ద్వారా చెప్తాం. ఆ పదాలన్నీ క్రిస్టమస్ పండుగకు సంబంధించనవే. గుర్తించి సున్నా చుట్టండి.

జవాబు:
evil, celeste, dreamland, fairydreems,
fairydust, grandma, moonblam, palace, star.

రంగులేద్దాం

నేస్తాలూ...కింద బాక్సులో బోలెడన్ని గీతలున్నాయి కదా. దానిలో ఓ జంతువు, దాని ఆహారం చిక్కుకున్నాయి. అవేంటో చెప్పాలి. పోనీ మేం ఓ క్లూ ఇవ్వమా! • గుర్తు వున్న చోట ఎరుపును, •• గుర్తు వున్న చోట పసుపురంగును వేసి చూడండి.







తేడాలెన్నో...

ఫ్రెండ్స్... పైనున్న రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా వాటిలో ఐదు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టి చెప్పండే.

ఎవడి గోల వాడిది

టైగర్ ఉడ్స్ జంట

ఇదేమిటి ఎప్పుడో విడుదలైన సినిమా గురించి ఇప్పుడు చెబుతారనుకుంటున్నారా? లేక రాష్ట్రంలో కుమ్ములాడుకుంటున్న ప్రధాన పార్టీల గురించి అనుకుంటున్నారా? ఏదైనా ఇది నిత్య సత్యం. జిహ్వాకో రుచి పుర్రెకో బుద్ధి. ప్రపంచీకరణ పుణ్యమా అని రోజురోజుకూ అన్నార్తులు, దారిద్ర్యరేఖకు దిగువకు చేరుతున్నవారి సంఖ్య పెరుగుతోందని కమ్యూనిస్టులు, వామపక్షవాదులు, మానవతావాదులు ఆందోళన చెందుతున్నారు. ఎంత చెట్టుకు అంతగాలి సామాన్యులే కాదు బిలియనీర్లు కూడా బికార్లుగా మారుతున్నారని ఫోర్బ్స్ అనే పత్రిక వాపోతోంది. కోటీశ్వరులు, శతకోటీశ్వరుల గురించి మాత్రమే ప్రచురించే ఈపత్రిక అధ్యయనం ప్రకారం గత పదిహేను నెలల్లో అంటే ప్రపంచ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ శతకోటీశ్వరుల సంఖ్య 1,125 నుంచి ఈ ఏడాది మార్చి నాటికి 793కు తగ్గిపోయిందట. వారి సంపద 4.4లక్షల కోట్ల డాలర్ల నుంచి 2.4లక్షల కోట్ల డాలర్లకు పడిపోయిందట.

- సత్య

ఇదిలా ఉంటే రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌గారు మా శతకోటీశ్వరుల పోకడలేం బాగోలేదని చెబుతున్నారు. నడమంత్రపు సిరి నరం మీది పుండు నిలకడగా ఉండనీయదు మరి. ఆకస్మికంగా ధనవంతులైనవారు వారి సంపదను నిలబెట్టుకోలేకపోవటమే తమ అసలు సమస్య అని గతవారంలో టీవీలో అడిగిన ప్రశ్నపై వ్యాఖ్యానించారు. ఇక్కడ మీకో సంగతి చెప్పాలి. ఇద్దరు నడమంత్రపు సిరిగాళ్లు రష్యా నుంచి లండన్ వెళ్లారట. అందులో ఒకడు తన 'టై'ని చూపి "ఇదెంతో తెలుసా? వెయ్యి డాలర్లు (47వేల రూపాయలు)" అన్నాడట. రెండోవాడు "అదేమన్నా గొప్పా నేను సరిగ్గా ఇలాంటిదానినే రెండువేల డాలర్లకు కొన్నాను తెలుసా" అంటూ కాలరెగరేశాడట. రష్యా ప్రజాసంపదను లూటీ చేసిన వారు ఏం చేస్తున్నారయ్యా అంటే విదేశాల్లో విలాసవంతమైన పడవలను, భవనాలను కొనుగోలు చేసి ఖరీదైన అమ్మాయిలను వెంటేసుకొని తిరుగుతున్నారన్న వార్తలు వెల్లువెత్తుతున్నాయి. అసలే సోషలిజాన్ని కాలదన్నుకొని తప్పుచేశామా అని పునరాలోచనలో పడ్డ అనేక మంది రష్యన్లకు ఇలాంటి బాపతును చూసి ఎక్కడ మండాలో అక్కడ మండుతోంది. దేశంలోని 14.2కోట్ల మంది జనంలో పదిహేనుశాతం మంది నెలకు 180 డాలర్లతో బతుకుతున్నారు. కార్మిక సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు ఒక కాన్ఫెడరేషన్‌గా ఏర్పడాలని అధికారపక్షానికి దగ్గరగా ఉండే రెండు పెద్ద కార్మిక సంఘాలు నిర్ణయించాయి. అన్నట్లు చెప్పటం మరిచాను. హిట్లర్ దాడులను ఎదిరించి కోట్లాది మంది ప్రాణాలను బలిదానం చేసి ప్రపంచానికి నాజీల ముప్పు తప్పించింది రష్యా. అలాంటి దేశంలో నడమంత్రపు సిరిగాళ్లకు ఇప్పుడు హిట్లర్ అంటే మోజు పెరిగింది. ఆ దుర్మార్గుడు వినియోగించిన మెర్సిడెస్ కారును ఆరు-పదిహేను మిలియన్ డాలర్ల మధ్య సొమ్ము చెల్లించి ఒక ప్రబుద్ధుడు కొనుగోలు చేశాడట. అందుకోసం ఒక జెట్ విమానంలో వెళ్లాడట.

నరంలేని నాలుకలు ఏమైనా మాట్లాడతాయి. ఇటీవల మాస్కోలో అక్కడి అధికార పార్టీ యునైటెడ్ రష్యా ఒక సెమినార్‌ను నిర్వహించింది. దానికి చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధులను ఆహ్వానించింది. మీ దేశం 2009లో ఎనిమిది శాతం ఆర్థికాభివృద్ధిని సాధించనుందని విన్నాం మీ విజయరహస్యం ఏమిటో కాస్త చెప్పండి అని వారిని అడిగారట. రెండు దశాబ్దాల క్రితం అమెరికా, ఇతర ఐరోపా తరహా పెట్టుబడిదారీ విధానంతో అద్భుతాలు సృష్టిస్తామని జనాన్ని నమ్మించి సోషలిస్టు వ్యవస్థను కూలదోసిన వారు ఇప్పుడు కమ్యూనిస్టులను సలహా అడగటం ఆశ్చర్యంగా ఉంది కదూ! ఒపీనియన్స్ మార్చుకోకపోతే పొలిటీషియన్లు కాదు కదా ! గతంలో రాష్ట్రాన్ని విభజించాలని తెలంగాణా ప్రాంతంలో కోరిన మజ్లిస్ పార్టీ, జై ఆంధ్రను ఏర్పాటు చేయాలంటూ అక్కడ ఆందోళనకు దిగినవారు ఇప్పుడు సమైక్యతను కోరుతున్నారు. సమైక్యతకు కట్టుబడిఉన్నామని చెప్పిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇప్పుడు వేర్పాటు గురించి చెబుతున్నాయి. మరి వామపక్షం సిపిఐ కూడా అలాగే ఉంది కదా అంటున్నారా? అవును అది విచారకరమే. తాము సంక్షోభంలో పడుతున్నట్లు గమనించినపుడు ఏది వాటంగా ఉందనుకుంటే అటు ఊగుతూ పబ్బం గడుపుకోవటంలో ఎవరైతేనేం పాలకపార్టీలు ఎక్కడైనా ఒకటే.

పీకల్లోతు ఊబిలో దిగిన అమెరికన్లు సలహా అడిగితే వారేం చెబుతారు? మరి కమ్యూనిస్టులు చెబుతారా? చెప్పటమేమిటి చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియాలో చేసి చూపుతున్నారు. సోషలిస్టు వ్యవస్థను కూలదోసిన తరువాత ప్రభుత్వ ఆస్తులను అమ్మి కొంతకాలం, చమురు ధరలు పెరగటంతో వచ్చిన డబ్బుతో కొంతకాలం

గడిపిన పుతిన్ సర్కార్ ఇప్పుడు సంక్షోభంలో పడింది. అందుకే జనం దృష్టిని మళ్లించే ఎత్తుగడలో భాగంగానే చైనా వారిని సలహా అడిగారని అనుకోవాలి మరి. ఈ తతంగమంతా చూసిన వారు అబ్బే చైనా మోడల్ మనకు పనికిరాదని పెదవి విరుస్తున్నారు ఎందుకటా? మన మాస్కో మేయర్ యూరీ లుజుకోవ్ చైనాలోని షాంఘై మేయర్‌గా ఉన్నాడనుకోండి అప్పుడేమౌతుంది? మేయర్‌గా ఉంటూ కాంట్రాక్టులు పొంది అక్రమంగా ఆస్తులు సంపాదించినందుకు లుజుకోవ్,ఆయన భార్య ఎలేనాను ఎప్పుడో ఉరితీసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకొని ఉండేవారు. అందుకే మనకు అది పనికిరాదు, ఒక వేళ నిజంగా అమలు జరిపితే అధికార యునైటెడ్ రష్యాపార్టీని నమ్ముకున్నవారి జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. దాని బదులు మనకు బాగా పనికివచ్చే, అవినీతికి బాగా అనువుగా ఉండే నైజీరియా విధానాన్ని అనుసరించటం మంచిదని వ్యంగ్య వ్యాఖ్యానాలు విసురుతున్నారు. అందుకే రాజుకుంటున్న అగ్నిని చల్లార్చేందుకు ముందుగానే పుతిన్ ధనికులపై విమర్శలతో నీళ్ల చల్లటం ప్రారంభించాడన్నమాట!

అయ్యా రష్యన్ల తీరిలా ఉంది. ఇప్పుడు మనం మాస్కో నుంచి ఒకసారి వాషింగ్టన్ వెళ్లి వాళ్లెలా ఉన్నారో పరామర్శిద్దాం. అక్కడ ఇప్పుడు మీడియాను విపరీతంగా ఆకర్షిస్తున్న ఒక పెద్దమనిషి పేరు టైగర్ ఉడ్స్. టైగర్ గురించి చెప్పుకొనే ముందు మీకు చిన్న ప్రశ్న? గోల్ఫ్ అంటే ఏమిటి? పిల్లలు పల్లెటూళ్లలో గోళీ కాయలను గుంతల్లో వేసే ఆట మాదిరి పెద్దవాళ్ల కర్రతో బంతిని గోతిలో పడేట్లు కొట్టటం అనేగా మనం చూసింది. తెలిసింది. నిజమే. అయితే ఈ ఆట చాలా ఖరీదైనది.ఏడెనిమిది వందల సంవత్సరాల క్రితం ఐరోపాలో గొర్రెల కాపరులకు ఉబుసుపోనప్పుడు పచ్చిక భూముల్లో నక్కలు, కుందేళ్ల చేసిన గోతుల్లోకి కర్రలతో రాళ్లను కొట్టే పందాలు వేసుకొని ఆడేవారట. అదే ఇప్పుడు గోల్ఫ్ అయింది. ఈ ఆట ఆడటంలో ప్రపంచంలో నంబర్ ఒన్ ఆటగాడు అమెరికాకు చెందిన టైగర్ ఉడ్స్. ముందు నాకు కుటుంబం ముఖ్యం తరువాతే గోల్ఫ్ అన్నట్లు ఎప్పటికీ ఉండాలనుకుంటాను అని ఒక ఇంటర్వ్యూలో కుటుంబవిలువల గురించి గొప్పగా చెప్పాడు. క్షీణసంస్కృతికి ఆలవాలమైన అమెరికాలో కుటుంబవిలువలను పాటించేవారికి గౌరవం ఉంది. అయితే ఇలా కబుర్లు చెప్పినవారంతా మేడిపండు చూడ మేలిమై ఉండు పొట్టవిప్పి చూడ పురుగులుండు లాంటి బాపతే అని అనేకసార్లు రుజువైంది. ఎద్దుచేలో మేస్తుంటే దూడ గట్టున ఎలా ఉంటుంది. అమెరికా


హిట్లర్ కారు

అధ్యక్షుడిగా ఉన్న బిల్‌క్లింటన్ తన కూతురి వయస్సున్న మోనికాలెవిన్స్కీతో కథ నడిపిన విషయం తెలిసిందే. ఒక తండ్రిగా, గోల్ఫ్ ఆటగాడిగా రెండుపాత్రలను ఎలా పోషించాలో తెలుసుకొనేందుకు తాను స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో టైమ్ మేనేజ్‌మెంట్(సమయ సద్వినియోగం) కోర్సును కూడా అభ్యసించినట్లు చెప్పుకున్నాడు. ఇది చెప్పిన పదిరోజులకే పచ్చి పౌండరీకంగాడిగా (తిరుగుబోతు) ప్రపంచానికి వెల్లడైంది. గతనెలాఖరులో ఈ పెద్దమనిషి ఒక కారుప్రమాదంలో గాయపడ్డాడు. అదెలా జరిగిందో అతనూ చెప్పడు, పోలీసులూ బయటపెట్టరు. ఎందుకంటే ప్రపంచంలోని శతకోటీశ్వరులలో ఇతనూ ఒకడు మరి. క్రీడా కారులలో వందకోట్ల డాలర్ల ఆస్తిపాస్తులు కలిగిన మొదటి వ్యక్తిగా చరిత్ర కెక్కాడు. కష్టపడతాడు, భార్యా పిల్లలు, కుక్కలు, విలువలతో ఎలాంటి మచ్చలేని కుటుంబజీవనం గడుపుతున్నాడు అని ఎన్నో ప్రశంసలు పొందాడు. నవంబరు 27 తెల్లవారు ఝామున జరిగిన కారు ప్రమాదం గురించి అతకని సమాధానాలు చెప్పటంతో మనవాడు ఏదో ఎఫైర్‌లో చిక్కుకున్నాడని పత్రికలు కూపీలాగాయి. దాంతో నేనంటే నేనంటూ ఇప్పటికి 12 మంది టైగర్ ఉడ్స్‌తో ప్రేమాయణం నడిపినట్లు బయటపెట్టారు. ఇంత జరిగాక భార్య ఊరుకుంటుందా? నేను విడాకులిస్తానంటూ రోడ్డెక్కింది. టైగర్ ఉడ్స్ ఇక ముందు గోల్ఫర్‌గా ఉంటాడా లేదా అన్న చర్చ మొదలైంది. ఈ గొడవ నుంచి ఎలా బయటపడాలా అని టైగర్ ఉడ్స్ తలపట్టుకుంటే ఈ ఉదంతాన్ని కూడా సొమ్ము చేసుకొనేందుకు మీడియా పూనుకుంది. అసలు అమెరికాలో 30 నుంచి 60శాతం మందికి ఏదో ఒక ఎఫైర్ ఉంటుంది, అవన్నీ వారి వ్యక్తిగత జీవితాలని సమర్ధించేవారు కొందరు బయలుదేరారు. టైగర్‌ను ఆదర్శంగా తీసుకొని 8-17 సంవత్సరాల వయస్కులకు 'వ్యక్తిత్వ విద్య' కార్యక్రమానికి విరాళాలు ఇస్తున్నవారు ఇప్పుడు వెనక్కు తగ్గుతున్నారు. మా టైగర్‌బాబు మంచి భర్తగా తిరిగి భార్యతో సంబంధాలను కలుపుకోవాలంటే పిల్లలు తడుపుకున్న బట్టలను మార్చాలి, సెలవుల్లో వారితో గడపాలని టైగర్ మేనేజర్ చెబుతున్నాడు. టైగర్ భార్య గనుక విడాకులకు కేసు వేస్తేనా నా సామిరంగా 18.5 కోట్ల పౌండ్లను మంజూరు చేసే అతి పెద్ద విడాకుల కేసుగా చరిత్రలో నమోదవుతుందని విడాకుల కేసులు చూసే లాయర్లు లొట్టలు వేసుకుంటున్నారు. ఇంతకీ ఎవడిగోలవాడిలో అసలు కారు ప్రమాదం జరిగిన రోజురాత్రి ఏం జరిగిందో చెప్పలేదు కదూ? టైగర్ ప్రేమాయణం గురించి భార్య ఎలిన్‌కు తెలియటంతో వారి మధ్య మాటా మాటా పెరిగింది. కోపం వచ్చి చేతిలో ఉన్న సెల్‌ఫోన్ విసరటంతో అది ఉడ్స్ మూతికి తగిలి పన్ను విరిగింది. దాంతో పిచ్చెత్తిన వాడిలా ఇంటి నుంచి బయటపడి ఫుల్లుగా తాగి కారునడపటంతో ప్రమాదం జరిగిందని ప్రత్యక్షంగా చూసినట్లు ఒక వెబ్‌సైట్ పేర్కొన్నది. మనకు మెళ్లో మంగళసూత్రం లేకపోతే రకరకాల ఊహాగానాలు చేసినట్లు ఎలిన్ చేతికి పెళ్లినాటి ఉంగరం లేకుండా బయట కనిపించటంతో వారి వివాహం రద్దయినట్లు చెప్పేవారు కొందరు. ఒక్కొక్కడిది ఒక్కో గోల. టోటల్‌గా ఎవడి గోల వాడిది. ఓకే!

★

లంక ఆరాధ్యుడు రావణుడు



విభీషణాలయం

శ్రీలంకలో రావణుడి ఉనికి, రామాయణానికి సంబంధించి చారిత్రక అవశేషాల గురించి రకరకాల కథనాలు ఉన్నాయి. మన దేశ ప్రజలు శ్రీరాముడిని ఆరాధ్యదైవంగా కొలిచినట్టే శ్రీలంకలో రావణుడిని కొలుస్తారు. ఇక్కడ రాముడు చుట్టివచ్చినట్టు చెప్పే ప్రదేశాలను ఏ విధంగా అయితే పుణ్యస్థలాలుగా దర్శిస్తారో... అదే విధంగా శ్రీలంకలో రావణుడి లంక, ఆయన తిరిగినట్టుగా చెప్పే ప్రదేశాలను దర్శిస్తారు. అంతే కాదు ఆ ప్రదేశాలకు సంబంధ పురాణ గాథలు కూడా అనేకం ఉన్నాయి. అయితే శ్రీలంకవాసులు రావణుడిని దాశరథికి ప్రత్యర్థిగా భావిస్తూనే తమ దేశీయుడన్న నమ్మకంతో ఆయన్ను ఆరాధిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ రావణుడి జలపాతం, మహా రావణుడి కోట, విభీషణుడి ఆలయం, మండోదరి శివాలయం వంటివి ఎన్నో ఉన్నాయి. అంతేకాదు ఇక్కడ ఆంజనేయ స్వామి, సౌమిత్రిలను కూడా ఆరాధిస్తారు. ఆ విశేషాలేంటో తెలియాలంటే...అలా అలా అక్షరయాత్ర చేసి శ్రీలంక చేరుకోవాల్సిందే....

ఆంధ్రప్రదేశ్‌కు, శ్రీలంకకూ అప్పటికే చాలా మంచి సంబంధాలుండేవి. అప్పట్లో విజయనగర సామ్రాజ్యం శ్రీరంగపట్నం వరకూ విస్తరించి ఉంది. మధుర, తంజావూరు, గిరిగి, వెల్లూరు వంటి ప్రాంతాలన్నీ ఈ సామ్రాజ్యంలోనే ఉండేవి. ఈ ప్రాంతాల పాలకులు తెలుగు మాట్లాడేవారు. వారిని నాయకరాజులు (నాయికర్‌లు), వదుక్కన్‌లు లేదా వడుగాస్ అనేవారు. ఆ సమయంలో పోర్చుగీసు వారు శ్రీలంకపై దాడి చేశారు. అప్పటి రాజు విమలాధర్మసూర్య తెలుగువారి సహాయాన్ని కోరాడు. అప్పటి నుండి తెలుగువారు సింహళీయులతో కలిసిపోయారని చెప్తారు. అప్పటి నుంచి ఒకరి ఆచార వ్యవహారాలను మరొకరు పాటించడమే కాకుండా సింహళ రాజులతో తెలుగు రాజకన్యల వివాహం జరిగింది. తర్వాత శ్రీలంక రాజరిక వ్యవస్థలో భాగమయ్యారు. సింహళులు నాలుగు తెగలుగా ఉండేవారు. నాగ, యక్క(యక్ష), దేవ, గందబ్బ(గంధర్వ) జాతులనుంచి అవి ఉద్భవించాయి. ఇవి పౌలస్త్య మహర్షి కుటుంబానికి చెందినవని సింహళ పురాతన గ్రంథాలు చెబుతున్నాయి. ఈ జాతులవారు సూర్య చంద్రులను ఆరాధ్యదైవాలుగా పూజించేవారు. ప్రాచీనకాలంలో శ్రీలంక జెండాపై సూర్యచంద్రులు, రావణుడి చిత్రాలు ఉండేవట.

మనదేశంలో రాముడు, సీత ఉన్నారని నమ్ముతున్నట్లే శ్రీలంకలో రావణుడు ఉన్నాడని, తమ దేశానికి రాముడు దండెత్తి వచ్చాడని నమ్ముతున్నారు. శ్రీరాముడు అయోధ్యలో పుట్టాడని, దండకారణ్యంలో వనవాసం చేశాడని, ఆయనకు శబరి పళ్లు తినిపించిందని పురాణంలో ఉన్నట్లే, రావణుడు, ఆయన తమ్ముడు విభీషణుడు, రాముడు, సీతలకు సంబంధించి అనేక చారిత్రక ప్రదేశాలున్నాయని వారు చెప్పుకుంటారు. రావణుడు ఆర్యుడా, ద్రవిడుడా అన్న విషయంపై ఇప్పటికీ సింహళీయులకు, అక్కడి తమిళులకు చర్చ సాగుతూనే ఉంది.

రావణ జలపాతం

శ్రీలకంలోని కాండీకి (బౌద్ధ క్షేత్రం) సమీపంలో సముద్ర మట్టానికి 1,041 మీటర్ల ఎత్తున ఉన్న కొండలపై ఒక పెద్ద జలపాతం ఉంది. ధాన్ని శ్రీలంకవాసులు 'రావణ ఎల్లా' అని పిలుస్తారు. దాని వెనుక ఒక పెద్ద గుహ



తిరుకోనేశ్వరం



మున్నీశ్వరం

ఉందని, దాంట్లోనే రావణుడు సీతను ఎత్తుకెళ్లినప్పుడు కొంతకాలం దాచి ఉంచాడని అక్కడివారు చెప్పుకుంటారు. అక్కడికి దగ్గరలోనే ఒక గుహలో రావణుడి పేరుతో ఒక దేవాలయం ఉంది. ఈ గుహలో ఉన్న శిల్పకళా నైపుణ్యం ఎంతో మెచ్చుకోదగింది. ఏనుగుల శిల్పాలు, దేవతల శిల్పాలు ఎంతగానో ఆకర్షిస్తాయి. అంతేకాదు ఈ గుహకు ఒక చారిత్రక కథ కూడా ఉంది. వేలాది సంవత్సరాల క్రితం మానవులను భక్షించే హోమోసెపియన్స్ అనే బాలగొండ జాతి మనుషులు ఇక్కడ సంచరించేవారు. వారికి సంబంధించిన 10 అస్థిపంజరాలను ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త డా॥పాల్ దేరనియా ఈ గుహలోనే కనుగొన్నారు.

కాండీ సముద్రమట్టానికి 490 కిలోమీటర్ల దూరంలో ఒక బౌద్ధ మందిరం ఉంది. దాన్ని ఆ దేశ సైనికులు అనుక్షణం కాపాడుతున్నారు. ఈ మందిరంలో పెద్ద పెద్ద, అందమైన బుద్ధుడి కాంస్య విగ్రహాలున్నాయి. ఈ ప్రదేశంలో బుద్ధుడి దంతం ఉంది. దీన్ని సింహరాజు ఆంధ్రప్రదేశ్ నుంచే ఇక్కడికి తీసుకు వచ్చాడని తెలిపే చిత్రపటాలున్నాయి. ఈ చారిత్రాత్మక ప్రదేశంపై 1998 జనవరి 26న టైగర్ల ఆత్మాహుతి దళాలు చేసిన దాడిలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఈ ప్రదేశంలోని కొన్ని చారిత్రక అవశేషాలు ధ్వంసమయ్యాయి.

రావణకోట

శ్రీలంకలోని తిరుకోనేశ్వరం అనే ఆలయం పర్యాటకులకు అద్భుతమైన ప్రదేశం. పోర్చుగీసువారు దండయాత్ర చేసినప్పుడు ఈ ఆలయానికి సంబంధించిన చారిత్రక అవశేషాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయి. అంతేకాదు ఈ ఆలయం అనేక సార్లు తుఫాను బారిన పడింది. అయితే ఆ ప్రాంతంలోనే రావణుడి కోట ఉంది. దీన్నే మహా రావణకోట అంటారని అక్కడి ప్రజలు చెప్తుంటారు. ఇక్కడి ప్రధాన మందిరం చుట్టూ దక్షిణమూర్తి, లింగోద్భం, చంద్రశేఖర, దుర్గ, భైరవ, చండీశ్వర, నవగ్రహాలు మొదలైన విగ్రహాలు పర్యాటకులను ఎంతగానో అలరిస్తాయి. ఇక్కడికి దగ్గరలోని కేతీశ్వరం అనే ప్రాంతంలో ఉమామహేశ్వర ఆలయాన్ని రావణుడి భార్య మండోదరి కట్టించిందని కూడా చెప్తుంటారు.

త్రికోణమలి-ట్రింకోమలి

ఈ ప్రదేశంలో ఏడు జలపాతాల నుంచి నీరు అత్యంత వేగంగా వస్తుంటాయి. ఈ జలపాతాలలో కొన్నిటిని నుంచి వచ్చే నీరు వణికించేంత చల్లగానూ, కొన్నిటి నుంచి వచ్చే నీరు సలసల మరిగేవిగానూ ఉంటాయి. ఇది ఒక అద్భుతమైన ప్రదేశం. దీన్ని కోణాచల దక్షిణ కైలాసమని కూడా అంటారు. అయితే దీనికి సంబంధించి ఒక కథ ప్రచారంలో వుంది. కైలాస పర్వతం నుంచి శివలింగాన్ని తెచ్చి లంకలో ప్రతిష్ఠింపచేయాలని రావణుడు విఫలయత్నం చేస్తాడు. ఆయన భక్తికి మెచ్చిన శివుడు ముక్కోణాకారంలో ఉన్న శివలింగాన్ని ప్రతిష్టించడానికి అనుమతినిచ్చాడట. అందుకే ఈ ప్రాంతానికి త్రికోణమలి-ట్రింకోమలి అనే పేరు వచ్చిందని చెప్తారు.

మున్నీశ్వరం

ఈ ఆలయం అతి పురాతనమైన హిందూ ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ రాముడు రావణుడి సంహారం అనంతరం లింగాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడి శిల్పకళ అత్యంత అద్భుతంగా ఉంటుంది. రావణుడు లంకాపురి నుంచి కోనేశ్వరం వస్తుండగా మార్గమధ్యలో ఒకండమలైన అనే ప్రాంతంలో విశ్రమించాడట. ఆ ప్రాంతంలో ఒక మందిరాన్ని నిర్మించారు. దీన్ని కూడా సందర్శిస్తుంటారు. ఇక్కడ మరో అందమైన ప్రదేశం సువారా ఎలియాలోని అశోకవనం. ఇక్కడే రావణుడు సీతాదేవిని బంధించాడని భావిస్తారు. అందువల్లే ఈ ప్రదేశంలో సీతాదేవి, ఆంజనేయుడి ఆలయాలను నిర్మించారు. ఈ ప్రాంతాన్ని అశోక అరమాయా అని కూడా అంటారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి లంక ప్రభుత్వం కోట్లాది రూపాలయలను వెచ్చించింది.



రావణకోట



సుగ్రీవుని గుహ

రామరావణ రణస్థలి

ఎగువ ఉవా ప్రాంతంలో రామరావణులకు యుద్ధం జరిగిందని, ఆ సమయంలో వారు ఉపయోగించిన ఆయుధాలు పర్వతాలపై తగిలి గర్తులేర్పడ్డాయని ఇక్కడి ప్రజలు చెప్తుంటారు. ఈ ప్రాంతాన్ని క్రీ.శ 477 సమయంలో కశ్యపుడనే రాజు పరిపాలించాడు. అయితే కశ్యపుడికి 20 వేల సంవత్సరాల క్రితమే ఇక్కడ నాగరికత ఉందని పురావస్తు ఆధారాల్లో బయటపడింది. ఈ ప్రాంతంలో రావణుడి తమ్ముడు కుబేరుడి కోట ఉందని అంటారు. అనురాధాపురంలో రావణుడు తన తల్లిదండ్రులైన విశ్రవాస ముని, కేసినిల కోసం ఒక మందిరాన్ని నిర్మించాడని, తర్వాత కాలంలో దానిని బౌద్ధ మందిరంగా మార్చారని అంటారు.

విభీషణాలయం

రావణుడి సోదరుడైన విభీషణునికి ఒక ఆలయం ఉంది. ఇది కొలంబోకు సమీపంలోని కెలానియాలో ఉంది. కెలానియాని అప్పట్లో కళ్యాణి అని పిలిచేవారు. ఈ ప్రాంతాన్నే రావణుడు రాజధానిగా చేసుకున్నాడని అంటారు. ఈ ప్రాంతంలోని ఆలయాలు ఎంతో పురాతనమైనవి. ఈ ఆలయాలను బుద్ధుడు కూడా సందర్శించాడట.

రమసలఖండ లోనిదే సంజీవని

అనేక ఆయుర్వేద మూలికలు లభించే రమసలఖండ అనే పర్వత ప్రాంతం నుంచే ఆంజనేయుడు సంజీవని అనే మూలికను తెచ్చి లక్ష్మణుడి ప్రాణాలు కాపాడాడని అంటుంటారు. ఇక్కడికి దగ్గరలోని సబ్రగాముావాలో లక్ష్మణుడి మందిరం ఉంది. కుంభకర్ణుడి కుమారుడు నిహుంబా వల్లే ప్రస్తుతం నెగాంబోగా పిలుస్తున్న ప్రాంతానికి ఈ పేరు వచ్చిందని ఇక్కడివారు చెప్తారు. అంతేకాదు సిఎస్ నవరత్నం అనే చరిత్రకారుడు రాసిన హిందూయిజం చరిత్ర, చరిత్రకారుడు గుణవర్దనే రాసిన అనేక గ్రంథాల్లో అనేక శ్రీలంకలోని అనే రహస్యాలను మనం తెలుసుకోవచ్చు. శ్రీలంకలోని దాదాపు 300 గ్రామాలను రావణుడి పేరును పోలే పేర్లతో పిలుస్తారు. ఇక్కడ అనేక ప్రాంతాలలో రామరావణులకు యుద్ధం జరిగిందని చెప్పుకుంటారు.

శ్రీలంకలో రావణుడి పేర కొండలు, రాళ్లు, గుహలు, జలపాతాలు వున్నాయి. అయితే ఇక్కడ కూడా మనదేశంలోలాగానే ఈ స్థలపురాణాలను కొట్టిపారేసేవారూ ఉన్నారు. సీతారాములను, లక్ష్మణుడిని, రావణుడిని, మండోదరిని పూజించేవారు కూడా ఉన్నారు.

★

వికాసం

ఏం చదువులో... ఏంటో...



- డా॥ డి.ఆర్.కె.ప్రసాద్

"అదేమిటండీ సొంత మేనమామల పేర్లు కూడా తడుముకుని, పుస్తకం తీసి చదివి సమాచారం ఇస్తారేంటి?" అని అడిగాను. చిన్నప్పటి నుండి చదువులో మునిగి బంధువుల ఇళ్లకు ఎప్పుడూ పోలేదు సార్. వాళ్లతో పరిచయం తక్కువ. అందుకే ఇలా..." అని బదులిచ్చాడా యువకుడు.

మరి వేసవి సెలవుల్లో ఏం చేసేవారు? మీరు వాళ్లనో, వాళ్లు మిమ్మల్నో కలుస్తారు కదా?" అంటే "వేసవి సెలవుల్లో మా నాన్నగారు "స్పెషల్ కోచింగ్ క్లాసులకు పంపారు. ఎప్పుడైనా మా మేనమామలూ, వాళ్ల పిల్లలూ వేసవిలో మా ఇంటికి వచ్చేవారు. కానీ వారు రాగానే నన్నూ, తమ్ముడినీ వేరే గదిలోకి పంపి, చదువుకోమని తలుపులేసేవారు. ఆ తర్వాత కొన్నాళ్లకు వారు కూడా మాదగ్గరకు రావడం తగ్గించారు. అందుచేత ఏదో లీలగా తప్ప వాళ్ల పరిచయాలేవీ నాకు గుర్తులేవు" అని చెప్పాడు.

కొద్దిపాటి పూర్వ పరిచయం గల ఒకాయన ఇటీవల మా ఇంటికి వాళ్లబ్బాయిని తీసుకువచ్చాడు. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ రావడంతో ఆ అబ్బాయికి ఉస్మానియా మెడికల్ కాలేజీలో డాక్టర్ సీటు వచ్చిందని చెప్పి, స్వీట్లు పంచారు. వారినభినందించాను.

ఇంత వరకూ బాగానే వుంది కానీ, ఆ తర్వాత ఉత్సాహంగా ఆయన చెప్పిన విషయాలే నన్ను ఆలోచింప జేశాయి. తనది చల్లపల్లి దగ్గరలోని గ్రామమనీ, మధ్య తరగతి వ్యవసాయ కుటుంబమనీ, శ్రద్ధగా వ్యవసాయం చేసుకునేవాడనీ ప్రారంభించిన ఆ వ్యక్తి, తన పిల్లలకు స్కూల్ వయసు రాగానే బాగా ఆలోచించి 'మంచి' చదువుల కోసం హైదరాబాద్‌కు తన మకాం మార్చేశానని కొంత తృప్తిగా, కొంత గర్వంగా చెప్పాడు. అప్పటి నుండి గడచిన 15 ఏళ్లలో, ఇక్కడి వ్యవసాయం చూసుకోవడానికి గానీ, బంధుమిత్రుల శుభాశుభకార్యాల కోసం గానీ తానొక్కడే వచ్చి వెళ్లేవాడని చెప్పాడు. భార్యను తీసుకుని వస్తే ఎక్కడ పిల్లల చదువులు కుంటుబడతాయోనని తాను మాత్రమే వచ్చి వెళ్లేవాడట.

ఎంసెట్‌లో మెడిసిన్ సీటు వచ్చిన సందర్భంలో ఆ బాబును తన సొంత ఊరుకు వెంటబెట్టుకుని వచ్చి "ఇది మన ఊరు, ఇవే మన పొలాలు, వీళ్లు మన బంధువులు, వీరేమో మన ఇరుగు పొరుగు వాళ్లు అని కొందర్ని చూపించి పరిచయం చేశాడట. ఆ వరసలోనే ఆ బాబుకు "మన ప్రాంతంలో ఒక డాక్టరు" అని నన్ను పరిచయం చేశాడు. 18 ఏళ్ల ఆ కుర్రవాడి మాటతీరు, చూపులు, ప్రవర్తన చూస్తే నాకెందుకో ఆతడొక కొత్త లోకానికి చెందినవాడుగా అనిపించింది.

15 ఏళ్లపాటు తన మూలాలేమిటో, తన వాళ్లెవరో తెలియకుండా పెరగటం, చదవటం, పిల్లల కవసరమా?

ఇటీవల నా మిత్రుని ఆఫీసులోకి మరొక చోటు నుండి బదిలీ మీద వచ్చిన 22ఏళ్ల యువకుణ్ణి కలుసుకున్నాను. పరిచయంలో భాగంగా "మీదే ఊరు? తల్లిదండ్రులేంచేస్తుంటారు? తోబుట్టువులెందరు?" వంటి ప్రశ్నలడుగుతూ, మీ మేనమామలెందరు? ఏం చేస్తుంటారు? అని అడిగాను. అతడు వెంటనే తన జేబులోని చిన్న పుస్తకం తీసి తెరచి -

మొదటి మేనమామ - ఫలానా ఊరు - పోస్టాఫీసులో ఉద్యోగం

రెండవ మేనమామ - ఫలానా ఊరు - టీచరుగా చేస్తున్నారు

మూడవ మేనమామ - ఆయన పిల్లల పేర్లు.... అని టకటకా చెప్పేశాడు.

"అదేమిటండీ సొంత మేనమామల పేర్లు కూడా తడుముకుని, పుస్తకం తీసి చదివి సమాచారం ఇస్తారేంటి?" అని అడిగాను. చిన్నప్పటి నుండి చదువులో మునిగి బంధువుల ఇళ్లకు ఎప్పుడూ పోలేదు సార్. వాళ్లతో పరిచయం తక్కువ. అందుకే ఇలా..." అని బదులిచ్చాడా యువకుడు.

మరి వేసవి సెలవుల్లో ఏం చేసేవారు? మీరు వాళ్లనో, వాళ్లు మిమ్మల్నో కలుస్తారు కదా?" అంటే "వేసవి సెలవుల్లో మా నాన్నగారు "స్పెషల్ కోచింగ్ క్లాసులకు పంపారు. ఎప్పుడైనా మా మేనమామలూ, వాళ్ల పిల్లలూ వేసవిలో మా ఇంటికి వచ్చేవారు. కానీ వారు రాగానే నన్నూ, తమ్ముడినీ వేరే గదిలోకి పంపి, చదువుకోమని తలుపులేసేవారు. ఆ తర్వాత కొన్నాళ్లకు వారు కూడా మాదగ్గరకు రావడం తగ్గించారు. అందుచేత ఏదో లీలగా తప్ప వాళ్ల పరిచయాలేవీ నాకు గుర్తులేవు" అని చెప్పాడు.

జీవితంలో ఏ రంగంలో రాణించాలన్నా సరైన మానవ సంబంధాలు తప్పని సరి అని మనకు తెలుసు. నిత్య జీవితంలో మనకు నిజమైన సంతోషాన్నిచ్చే ముఖ్యమైన అంశం కుటుంబంతో, బంధుమిత్రులతో, ఇంకా చుట్టూ గల సమాజంతో వున్న మానవ సంబంధాలే కదా!

కనీసం దగ్గరి బంధువుల పరిచయమైనా లేని ఇలాంటి విద్యార్థులు జీవితంలో స్థిరపడ్డాక ఎవరినుద్ధరించాలి? తాను బ్రతికే సమాజంలోని ఏ రంగంలో ఏ మార్పులు తేగలరు? బంధుమిత్రులతో, ఇరుగుపొరుగు మనుషులతో కనీస సంబంధాలు లేక, మనసు విప్పి వివిధ విషయాల మీద చర్చించక, కష్ట సుఖాలు కలబోసుకోక, తలుపులు బిడాయించుకొని, వాస్తవ సమాజానికి దూరమై చదువుల్లో మార్కుల్లో మునిగి తేలే ఈ పిల్లలు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యల నెదుర్కొని పరిష్కరించుకోగలరా?

మానవ సంబంధాలకు మంగళం పాడే ఇలాంటి చదువులు మనకవసరమా? లేక మానవ సంబంధాలు కూడా పదిలంగా ఉండే చదువులు కావాలా? ఆలోచించాలి మరి!

★

క్రిస్టమస్ వెలుగులు

క్రిస్టమస్ పండుగ వస్తోందనగానే గుర్తొచ్చేది క్రిస్టమస్ చెట్టు. పిల్లలు, పెద్దలు ఎంతో ఆసక్తిగా, ఉత్సాహంగా దాన్ని అలంకరిస్తారు. కొవ్వొత్తులు, ఆభరణాలు, బొమ్మలు, రిబ్బన్లు, బంతులు, గులాబీలు, పూదండలు, పూసల దండలు, విద్యుద్దీపాలతో చెట్టును ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. అన్నట్టు క్రిస్టమస్ చెట్టు అలంకరణ 16వ శతాబ్దం నుంచే ప్రారంభమైంది. తమాషా ఏంటంటే... అప్పట్లో క్రిస్టమస్ చెట్టును యాపిల్ పళ్లు, ఖర్జూరాలు, కాగితపు పూలతో అలంకరించేవారు. అప్పడూ ఇప్పడూ ఎంత పెద్ద చెట్టును అలంకరిస్తే అంత గొప్ప. అమెరికా, జపాన్, చెక్, రష్యా వంటి పలు దేశాల రాజధానుల్లో అలంకరించిన క్రిస్టమస్ చెట్ల వెలుగులు ...మిలమిలలు చూడ్డానికి రెండు కళ్లూ చాలడంలేదు కదూ!

ఏడు కుండలు



- చూటీ

జరిగినకథ :

రామప్ప మంచి క్షురకుడు. మంచి పనిగాడు. అది చూసే రాజుగారు అతణ్ణి పనిలో పెట్టుకుంటాడు. రాజప్రాసాదంలో అందరూ బంగారు ఆభరణాలు పెట్టుకోవడం చూచి పుత్తడి మీద మోజు పెంచుకుంటాడు రామప్ప. ఎలాగైనా బంగారు నగలు చేయించుకొని ధరించాలనుకుంటాడు. చేయించుకుంటాడు కూడా. కానీ అతనిలో బంగారం పట్ల ఆసక్తి, ఆశ మరింత పెరుగుతుంది. ఓసారి అడవిలో కూర్చుని కూడా అదే విషయం ఆలోచిస్తుంటాడు. అప్పుడు అతనికి ఓ చెట్టు ఏడుకుండల బంగారు నగలను ప్రసాదిస్తుంది. అయితే ఏడో కుండ సగానికే నగలుంటాయి. ఆ కుండ నింపడానికి రామప్ప, అతని భార్య ప్రయత్నిస్తుంటారు. ఆఖరుకు తిండి కూడా తినడం మానేసి డబ్బు పోగేసి బంగారం కొంటుంటారు. కుండ మాత్రం ఎంతకీ నిండదు. అయితే రామప్ప, అతని భార్య చిక్కి శల్యమైపోతారు. ఆ విషయాన్ని రాజుగారు గమనిస్తాడు. ఆ తర్వాత...

♦♦♦

ఓరోజు, రాజుగారు రామప్పను ఇలా అడుగుతాడు.

"రామప్పా! రోజు రోజుకూ అలా పీనుగలాగా తయారౌతున్నావేంటి? ఏదైనా జబ్బు చేసిందా?" అనడుగుతాడు.

దానికి రామప్ప దిగాలుగా..."కొద్దిగా డబ్బు సమస్యవల్ల ఇలా అయ్యాను మహారాజా! అంతకుమించి మరే కారణం లేదు" అంటాడు.

అప్పుడు రాజు

"ఓ... డబ్బా! అదేమంత పెద్ద కష్టం కాదే. నేను నీ జీతాన్ని రెట్టింపు చేస్తాను. నీ సమస్య తీరిపోతుంది" అంటాడు. ఆ విషయాన్ని కోశాధికారికి కూడా చెప్తాడు. అప్పటినుంచి రామప్పకు జీతం పెరుగుతుంది.

కానీ ఆ డబ్బు కూడా సరిపోదు కుండ నింపడానికి. ఇంకా ఖాళీ వుంటుంది



కుండలో. తిండి ఇంకా తగ్గించుని డబ్బు పొదుపు చేయాలనుకుంటారు. అలా చేసినా కుండ నిండదు.

♦♦♦

రామప్ప ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తుంది. మరింత బలహీనంగా తయారౌతాడు. ఇవాళో రేపో పోయేవాడికి లాగా తయారౌతాడు. రాజుగారు ఇదంతా గమనిస్తాడు.

ఓరోజు తనకు క్షవరం చేయడానికి వచ్చిన రామప్పను " నిజం చెప్ప రామప్పా! నీ దగ్గర ఏడు బంగారు కుండలు వున్నాయికదూ. అడవిలో చెట్టు నీకు ఇచ్చిందికదూ" అనడుగుతాడు.

రామప్పకు ఆశ్చర్యం వేస్తుంది. రాజుగారికి తన విషయం ఎలా తెలిసిందోనని!

"మహారాజా! ఆ విషయం మీకెలా తెలుసు. అది నాకు, నా భార్యకు మాత్రమే తెలుసే" అనడుగుతాడు.

అప్పుడు రాజు నవ్వుతూ..."ఓసారి నేను కూడా అడవిలో చెట్టు దగ్గర నుంచి ఆ కుండలు తీసుకున్నాను. ఆ ఏడవ కుండ వుంది చూశావూ... అది సగమే నిండింది. దురాశతో దాన్ని నింపాలని నేను ఎంతగానో ప్రయత్నించాను. కానీ నావల్ల కాలేదు. నేను కూడా ఆరోగ్యం పాడుచేసుకున్నాను...." అని చెప్పుండగానే రామప్ప కలగచేసుకొని కుతూహలంగా...

"అప్పుడు మీరు ఏం చేశారు రాజా!?" ఉత్సుకతతో అడిగాడు రామప్ప.

రాజు "దురాశ మా చెడ్డదని తెలుసుకున్నాను. అంతేకాదు! దురాశకు అంతం లేదని కూడా అర్థమైంది. నాకు చెట్టు గుణపాఠం చెప్పాలనుకుందని తెల్సింది. వెంటనే నేను చెట్టు దగ్గరకెళ్ళి ఏడు కుండలను వెనక్కి తీసుకోమని కోరాను. నేను రాజప్రాసాదానికి వచ్చేసరికి కుండలు లేవు. అప్పటి నుంచి నేను నా దగ్గర వున్న డబ్బుతోనే సంతోషంగా వున్నాను" అని చెప్పాడు.

రామప్పకు ఏడుకుండల సమస్యకు పరిష్కారం లీలగా తెలుస్తుంది. రాజు మళ్లీ కలుగచేసుకొని

"ఇప్పటికైనా మించిపోయిందేం లేదు. వెంటనే ఆ కుండలను వెనక్కి ఇచ్చేసెయి. లేకపోతే నిన్ను ఎవ్వరూ కాపాడలేరు" అని సలహా ఇస్తాడు.

రామప్ప తన దగ్గర వున్న ఏడు కుండలను తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకుంటాడు.

వెంటనే రామప్ప పరుగుపరుగున చెట్టు దగ్గరకెళ్లి తన దగ్గరున్న ఏడు కుండలను వెనక్కి తీసుకోమని అర్థిస్తాడు.

అతను తిరిగి ఇంటికి వచ్చేసరికి ఎక్కడా కుండలు కనిపించవు.

అప్పుడు భార్యాభర్తలిద్దరూ సంతోషిస్తారు. దురాశకు మించిన దురలవాటు మరొకటి లేదని వారు తెలుసుకుంటారు. అప్పటి నుంచి తమకున్న సంపాదనలోనే సుఖంగా బతకసాగారు.

♦